

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 188 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 16 నవంబర్ 2025 | వెల : 4/-


# రేవంత్ సైలెంట్ వార్నింగ్

బీహార్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ముఖ్యమంత్రిని మారుస్తారన్న ప్రచారం జరిగింది

అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల ప్రభావం కూడా ఈ ఉప ఎన్నికల్లో పనిచేయలేదు

ప్రత్యర్థులు చేసే విమర్శలను ప్రజలు పెద్దగా పట్టించుకోలేదన్నది ఈ ఎన్నిక ఫలితం ద్వారా చూడాలి.





**రెండేళ్లలో రెండు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ను రేవంత్ ఒంటి చేత్తో గెలిపించారు**

**గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి నాయకత్వంపై అనేక ప్రచారాలు జరుగుతున్నాయి**

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మరింత ఊపు తెచ్చింది. రెండేళ్లలో రెండు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ను రేవంత్ ఒంటి చేత్తో గెలిపించారు. గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి నాయకత్వంపై అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. బీహార్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ముఖ్యమంత్రిని మారుస్తారన్న ప్రచారం జరిగింది. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల ప్రభావం కూడా ఈ ఉప ఎన్నికల్లో పనిచేయలేదు. ప్రత్యర్థులు చేసే విమర్శలను ప్రజలు పెద్దగా పట్టించుకోలేదన్నది ఈ ఎన్నిక ఫలితం ద్వారా చూడాలి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అంత సులువుగా ఎంపిక కాలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినా నాటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడంలో విఫలమయింది... అందుకే టీడీపీ నుంచి వచ్చినా రేవంత్ రెడ్డిలో ఉన్న ఫైర్ ను చూసి కాంగ్రెస్ నాయకత్వం పీసీసీ చీఫ్ బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుంచి నాడు పదేళ్ల నుంచి అధికారంలో ఉన్నకేసీఆర్ పై రేవంత్ రెడ్డి మాటల దాడి కూడా ప్రజలను ఆకట్టుకుంది. ఫలితంగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అందువల్లనే ఢిల్లీ నాయకత్వం రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి అప్పగించింది. సీనియర్లున్నా, పార్టీని తొలి నుంచి అంటిపెట్టుకున్న వారు పార్టీలో ఉన్నా వారందరినీ పక్కన పెట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం ఆయన పనితీరును పరిశీలించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంది. అయితే రేవంత్ రెడ్డి రాహుల్ దూరం పెడుతున్నారని కూడా ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారానికి ఈ ఎన్నిక ఫలితంతో చెక్ పెట్టినట్లయింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ముఖ్యమంత్రిని కూడా కేర్ చేయని ఎమ్మెల్యేలుంటారు. అలాంటి వారందరి నోళ్లు ఈ ఎన్నిక ఫలితం మూత పడేలా చేస్తుందనడలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యమంత్రి పదవి కొట్లాడి తెచ్చుకున్నది కాదని, కష్టపడి తెచ్చుకున్నదని రేవంత్ రెడ్డి ఈ ఎన్నికల్లో నిరూపించుకున్నారు. అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయని విధంగా కార్నర్ మీటింగ్ లు, రోడ్ షోలు చేసి ప్రజలను మెప్పించి, ఒప్పించి సీటును దక్కించుకోగలిగారు. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీలో - మిగతా 3లో


## ఫ్యూచర్ సిటీ.. భూ బ్యాంకుపై
# సర్కార్ ఫోకస్



- ఆయా మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయో గుర్తించే పనిలో నిమగ్నం
- ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్న సమీపంలోని మండలాల్లో భూ బ్యాంకును సిద్ధం చేసే పనిలో అధికారులు
- ప్రభుత్వం ఫోర్త్‌సిటీని నిర్మించే విషయంలో ప్రపంచ స్థాయిలో పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోంది.

యాచారం:

ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్న ఆయా మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయో గుర్తించే పనిలో నిమగ్నమైంది. తాజాగా సర్కార్ ఆదేశాల మేరకు ఆయా తహసీల్దార్లు తమ మండలాల పరిధిలోని ఏయే గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, సీలింగ్ భూములున్నాయో రికార్డులను పరిశీలిస్తున్నారు. వివరాల సేకరణలో అధికారులు ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్న సమీపంలోని మండలాల్లో భూ బ్యాంకును సిద్ధం చేసే పనిలో అధికారులు తలమునకలయ్యారు. యాచారం, కందుకూరు, - మిగతా 3లో



## కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు

- సూరత్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు..
- బీహార్ ప్రజలను కలవకుండా సూరత్‌ను వదిలి వెళ్తే.. ప్రయాణం వృథా అయినట్లుగా అనిపిస్తుంది
- బీహారీ సోదరుల మధ్యకు వచ్చి ఈ విజయోత్సవంలో భాగం కావడం తన బాధ్యత
- బీహార్ ప్రజలకు రాజకీయాలు నేర్పించాల్సిన అవసరం లేదు
- వారు ప్రపంచానికి రాజకీయాలు నేర్పిస్తారు

## నౌగామ్‌లో పేలుడు ఉగ్రకుట్ర కాదు.. ప్రమాదమే

- శాంపిల్స్ తీస్తుండగా భారీ విస్ఫోటనం
- ఈ దాడి తమ పనేనని ప్రకటించిన జైషేకు చెందిన అనుబంధ సంస్థ
- ఉగ్రవాద సంస్థ ప్రకటనను ఖండించిన డీజీపీ



# నవీన్ యాదవ్‌కు రాహుల్ అభినందనలు



రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ..

జూబ్లీహిల్ కొత్త ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరు

సమావేశానికి హాజరైన భట్టి, మహేశ్ గౌడ్

జూబ్లీహిల్స్ విజయం, రాష్ట్ర రాజకీయాలపై ప్రధానంగా చర్చ

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలపైనా చర్చ

జూబ్లీహిల్స్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ఢిల్లీలో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కీలక సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఈ భేటీకి హాజరయ్యారు. - మిగతా 3లో

## ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరం



- ఓటు హక్కు: జెన్ జెడ్ యువతకు నటుడు విజయ్ కీలక సందేశం
- వీడియోను విడుదల చేసిన నటుడు విజయ్
- ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచన
- రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు ఒకటి అన్న విజయ్

# కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు

**సూరత్:** బీహార్ ఎన్నికలు కులతత్వ విషాన్ని తిరస్కరించాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్ సూరత్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విరుచుకుపడుతూనే.. గుజరాత్‌లో నివసిస్తున్న బీహార్ ప్రజలను ఆయన పలకరించారు. ప్రధాని మాట్లాడుతూ.. బీహార్ ప్రజలను కలవకుండా సూరత్‌ను వదిలి వెళ్తే.. ప్రయాణం వృథా అయినట్లుగా అనిపిస్తుందన్న ఆయన.. గుజరాత్‌లో ముఖ్యంగా సూరత్‌లో నివసిస్తున్న బీహారీ సోదరుల మధ్యకు వచ్చి ఈ విజయోత్సవంలో భాగం కావడం తన బాధ్యత అన్నారు. బీహార్ ప్రజలకు రాజకీయాలు నేర్పించాల్సిన అవసరం లేదని, వారు ప్రపంచానికి రాజకీయాలు నేర్పిస్తారన్నారు.

బీహార్ కుల ఆధారిత రాజకీయాలను తిరస్కరించిందన్న ఆయన.. బీహార్ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా బీహార్ ప్రతిభను చూస్తారన్నారు. మా ప్రాథమిక ఆలోచన దేశం ముందు అని.. గత రెండు సంవత్సరాలుగా ఈ బెయిలబుల్ నాయకులు బీహార్‌కు వెళ్లి కులతత్వాన్ని ప్రకటిస్తున్నారని విమర్శించారు. తమ శక్తినంతా ఉపయోగించి కులతత్వ విషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించారని.. కానీ ఈ బీహార్ ఎన్నికలు ఈ కులతత్వ విషాన్ని పూర్తిగా తిరస్కరించారన్నారు. ఈ ఎన్నికల్లో, విజయవంతమైన ఎన్‌డీఏ కూటమికి, ఓడిపోయిన మహా కూటమికి మధ్య 10 శాతం ఓట్ల తేడా ఉందని.. ఇది



ముఖ్యమైన విజయమన్నారు. దీని అర్థం సాధారణ ఓటర్లు ఏకగ్రీవంగా ఓటు వేశారని.. ఇది బీహార్ అభివృద్ధి పట్ల ఉన్న మక్కువను ప్రతిబింబిస్తుందన్నారు. ఎన్నికల్లో యువత, మహిళలు ప్రతిపక్ష పార్టీలకు సరైన ఇచ్చారని.. బీహార్ ప్రజలు అభివృద్ధి ఎజెండాను ఆమోదిస్తూ ప్రతిపక్షాన్ని పూర్తిగా తిరస్కరించారని.. సూరత్‌లో పనిచేస్తున్న బీహార్ ప్రజలకు ఇక్కడ పూర్తి హక్కులు ఉన్నాయన్నారు.

ఈ సందర్భంగా మోదీ వక్ఫ్ చట్టాన్ని ప్రస్తావించారు. ఇళ్లను అక్రమంగా ఆక్రమించి వక్ఫ్ ఆస్తులుగా మార్చారని.. తమిళనాడులో మొత్తం గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా మార్చారని ఆరోపించారు. అందుకే పార్లమెంటులో వక్ఫ్ చట్టాన్ని ప్రవేశపెట్టామన్నారు. బీహార్ ఎన్నికల సమయంలో ఈ హామీదారులు, వారి మిత్రులు (ప్రతిపక్షాలు) వక్ఫ్ చట్టాన్ని బహిరంగంగా చించివేశారని.. వారు అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని అమలు చేయడానికి అనుమతి ఇవ్వమని చెప్పారని.. బీహార్ ప్రజలు కూడా ఈ మత రాజకీయాలను ఓడించారని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను ఎవరూ రక్షించలేరన్న ప్రధాని.. ఈ దేశం ముస్లిం లీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్‌ను తిరస్కరించిందన్నారు. కాంగ్రెస్ చర్యలతో దేశం అంసంతృప్తిగా ఉందని.. ఇకపై కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరన్నారు.

**బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను పరిశీలించిన ప్రధాని మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ(నవంబర్ 15, శనివారం) గుజరాత్‌లో పర్యటించారు. నర్మాదా దేవ్‌మోగ్రా ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిర్సా ముండా జయంతి వేడుకలకు ప్రధాని హాజరయ్యారు. రూ.9,700 కోట్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఉదయం సూరత్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని.. నిర్మాణంలో ఉన్న బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను సందర్శించి.. ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైలు కారిడార్ పురోగతిని సమీక్షించారు. ఎంఏహెచ్ఎస్ఆర్ భారతదేశం లోని అత్యంత ప్రతిష్టాత్మక మౌలిక వసతుల ప్రాజెక్టులలో ఒకటి. ఇది సుమారు 508 కి.మీ. పొడవు.

అందులో 352 కి.మీ. గుజరాత్, దాద్రా-నగర్ హవేలీలో, 156 కి.మీ. మహారాష్ట్రలో ఉంది. ఈ కారిడార్ సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదరా, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబై వంటి ప్రధాన నగరాలను కలుపుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక ఇంజనీరింగ్ సాంకేతికతతో నిర్మాణం జరుగుతోంది.

# ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ నామమాత్రమే

**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం ప్రకారం, 2014 నుంచి 2025 వరకు భారతదేశంలో 66 పూర్తి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.'అసెంబ్లీ ఎన్నికలు' అనే పదం ప్రధానంగా పూర్తి రాష్ట్ర ఎన్నికలకు ఉపయోగిస్తారు. బిహార్- 243 స్థానాల్లో ఎన్డీఏ 202 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 5 స్థానాల్లో ఉంది.ఢిల్లీ- 70 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో టీడీపీ కూటమి 164 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో బీజేపీ 46 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 1 సీటు గెలుచుకుంది.ఒడిశా- 147 స్థానాల్లో బీజేపీ 78 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 సీట్లు గెలుచుకుంది.సిక్కిం- 32 స్థానాల్లో ఎస్‌కేఎం 19 సీట్లు, కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది.హర్యానా- 90 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 20 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి 230 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకుంది.జార్ఖండ్- 81 స్థానాల్లో జేఎంఎం కూటమి 47 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.జమ్మూ కాశ్మీర్- 90 స్థానాల్లో ఎన్‌సీ 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మేఘాలయ- 60 స్థానాల్లో ఎన్డీఏ 31 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది. నాగాలాండ్- 60 స్థానాల్లో ఎన్డీఏ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.కర్ణాటక- 224 స్థానాల్లో కాంగ్రెస్ 135 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.మధ్యప్రదేశ్- 230 స్థానాల్లో బీజేపీ 163 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 66 సీట్లు గెలుచుకుంది. రాజస్థాన్- 200 స్థానాల్లో బీజేపీ 115 గెలుచుకోగా, కాంగ్రెస్ 69 సీట్లు గెలుచుకుంది.ఛత్తీస్‌గఢ్- 90 స్థానాల్లో బీజేపీ 54 గెలుచుకోగా, కాంగ్రెస్ 35 సీట్లు గెలుచుకుంది.తెలంగాణ- 119 స్థానాల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.మిజోరం- 40 స్థానాల్లో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ 27 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది. గోవా- 40 స్థానాల్లో బీజేపీ 20 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మణిపూర్- 60 స్థానాల్లో బీజేపీ 32 సీట్లు, కాంగ్రెస్ కేవలం 5 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఉత్తరాఖండ్- 70 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు, కాంగ్రెస్ 19 సీట్లు గెలుచుకుంది.పంజాబ్- 117 స్థానాల్లో ఆప్ 92 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 18 సీట్లు గెలుచుకుంది.ఉత్తరప్రదేశ్- 403 స్థానాల్లో బీజేపీ 255 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 62 సీట్లు గెలుచుకుంది.గుజరాత్- 182 స్థానాల్లో బీజేపీ 156 సీట్లు, కాంగ్రెస్ కేవలం 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది. హిమాచల్ ప్రదేశ్- 68 స్థానాల్లో కాంగ్రెస్ 40 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.పశ్చిమ బెంగాల్- 294 స్థానాల్లో టీఎంసీ 213 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అస్సాం- 126 స్థానాల్లో



బీజేపీ 60 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 29 సీట్లు గెలుచుకుంది.కేరళ- 140 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ 99 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు గెలుచుకుంది.తమిళనాడు- 234 స్థానాల్లో డీఎంకే 133 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది.పుదుచ్చేరి- 30 స్థానాల్లో ఎన్డీఏ 16 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 2 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఢిల్లీ- 70 స్థానాల్లో ఆప్ 62 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.బిహార్- 243 స్థానాల్లో ఎన్డీఏ 125 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 19 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. ఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో వైఎస్ఆర్-కాంగ్రెస్ 151 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.ఒడిశా- 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 112 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 14 సీట్లు మాత్రమే గెలుచుకుంది.సిక్కిం- 32 స్థానాల్లో ఎస్‌కేఎం 17 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ 132 సీట్లు, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.జార్ఖండ్- 81 స్థానాల్లో జేఎంఎం 30 సీట్లు, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకున్నాయి.కర్ణాటక- 224 స్థానాల్లో బీజేపీ 104 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 78 సీట్లు గెలుచుకుని కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.త్రిపుర- 60 స్థానాల్లో బీజేపీ 36 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.మధ్యప్రదేశ్- 230 స్థానాల్లో కాంగ్రెస్ 114 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.ఛత్తీస్‌గఢ్- 90 స్థానాల్లో కాంగ్రెస్ 60 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.రాజస్థాన్- 200 స్థానాల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.గోవా- 40 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 13 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 17 సీట్లు గెలుచుకుంది.మణిపూర్- 60 స్థానాల్లో బీజేపీ 21 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 28 సీట్లు గెలుచుకున్నా అధికారంలోకి రాలేదు.ఉత్తరప్రదేశ్- 403 స్థానాల్లో బీజేపీ 312 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఉత్తరాఖండ్- 70 స్థానాల్లో బీజేపీ 57 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 11 సీట్లు గెలుచుకుంది.పంజాబ్- 117 స్థానాల్లో కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.హిమాచల్ ప్రదేశ్- 68 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 44 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.గుజరాత్- 182 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 99 సీట్లు, కాంగ్రెస్ కేవలం 80 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.2016లో అస్సాం- 126 స్థానాల్లో బీజేపీ 86 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకుంది.కేరళ- 140 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ 91 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. తమిళనాడు- 232 స్థానాల్లో ఏఐఏడీఎంకే 136 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 8 సీట్లు మాత్రమే గెలుచుకుంది.పశ్చిమ బెంగాల్- 294 స్థానాల్లో టీఎంసీ 211 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.పుదుచ్చేరి- 30 స్థానాల్లో ఎన్డీఏ 17 సీట్లు, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకున్నాయి.2015లో 2 అసెంబ్లీ ఎన్నికలుఢిల్లీ- 70 స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 67 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.బిహార్- 243 స్థానాల్లో మహాకూటమి 178 సీట్లు గెలుచుకోగా, అప్పుడు కూడా కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.2014లో 8 అసెంబ్లీ ఎన్నికలుఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో వైఎస్ఆర్-కాంగ్రెస్ 67 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది.ఒడిశా- 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 117 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకుంది.సిక్కిం- 32 స్థానాల్లో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ 22 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.హర్యానా- 90 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ 122 గెలుచుకోగా, కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది.జార్ఖండ్- 81 స్థానాల్లో బీజేపీ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది.జమ్మూ కాశ్మీర్- 87 స్థానాల్లో పీడీపీ 28 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ప్రకారం, గత 11 ఏళ్లలో 66 పూర్తి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ మొత్తం 8 ఎన్నికల్లో గెలిచింది. 58 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇక్కడ ఓటమి అంటే మెజారిటీ రాకపోవడం లేదా కూటమికి నాయకత్వం వహించకపోవడం. ఓటు వాటా సగటున 19% ఉంది, కానీ సీట్ల మార్పిడి తగ్గింది. బీజేపీ ప్రభ, ప్రాంతీయ పార్టీల బలం, సంస్థాగత బలహీనత కాంగ్రెస్‌ను ఓడిపోయిన పార్టీగా మార్చాయి.

# పీకే ..పీకేందేమి లేదు

**పాట్నా :** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన సొంత జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా విఫలమయ్యారు. గతంలో అనేక పార్టీలకు విజయం అందించిన పీకే, ఈ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోగా, కనీసం ఆధిక్యం కూడా కనబరచలేకపోయారు. అనేక పార్టీలకు విజయం అందించిన ప్రశాంత్ కిషోర్ సొంత రాజకీయ ప్రస్థానం నిరాశపరిచింది. జన సూరజ్ పార్టీకి కనీసం ఒక్క ఆధిక్యం కూడా లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అందరికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చింది అనే సామెత మాదిరి తయారైంది జన సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పరిస్థితి. గత రెండు దశాబ్దాలుగా అనేక పార్టీలకు ఎలక్షన్ స్ట్రాటజిస్టుగా పని చేసి, పార్టీల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు రచించారు ప్రశాంత్ కిషోర్. ఇక తాను స్వయంగా రాజకీయాల్లోకి దిగి జన సూరజ్ పార్టీ స్థాపించి, సొంత రాష్ట్రం బీహార్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి దిగారు. అయితే అనూహ్యంగా ఈ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవకపోగా కనీసం ఆధిక్యాన్ని కూడా కనబరచలేకపోతోంది. మొత్తం 243 స్థానాల్లో ప్రశాంత్ కిషోర్ సహా.. ఏ ఒక్క చోట కూడా జన సూరజ్ పార్టీ ఓట్లు సాధించలేకపోయింది. అందరికీ స్ట్రాటజీలు ప్లే చేసే పీకే తన విషయం వచ్చేసరికి చతికిలా పడిపోయాడు పాపం అంటున్నారు రాజకీయ విమర్శకులు.బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ విపత్తుగా మారాయి. ఆయన పార్టీ జన్ సూరజ్ పార్టీ ఒకప్పుడు గేమ్-ఛేంజర్ గా, త్రిముఖ పోటీలో పోటీదారుగా ప్రశంసలు అందుకుంది. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. బీహార్ లోని 243 స్థానాల్లో పికె పార్టీ ఏ ఒక్కదానిలోనూ ఆధిక్యంలో లేదు. ఆయన అభ్యర్థులందరూ పేలవమైన స్థితిలో ఉన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని కుమ్రార్ నియోజకవర్గం విజయం కోసం అత్యంత గట్టిగా ఎదురుచూస్తున్న అభ్యర్థి, కానీ అక్కడ కూడా పీకే పార్టీ మూడవ స్థానంలో వెనుకబడి ఉంది. టీవీ ఛానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో, అనేక బహిరంగ సభలలో, ప్రశాంత్ కిషోర్.. "ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడదని రాతపూర్వకంగా రాసుకోండి. నవంబర్ తర్వాత నితీష్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదవి నుంచి తప్పుకుంటారు. కొత్త ముఖ్యమంత్రి నియమితులవుతారు" అని ఆయన అన్నారు. తన అంచనాలు విఫలమైతే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని ఖఐ రెండుసార్లు అన్నారు. జన్ సూరజ్ గెలిచినా, జేడీయూ గురించి తన అంచనాలు నిజం కాకపోయినా, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా, గతసారి కంటే మెరుగ్గా తీరు కనబరుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 200 సీట్ల మార్క్ దాటేసింది. ఒక్క జెడియు 80 సీట్లు గెలుచుకుంటుందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఖాతాను కూడా తెరవలేదు.జన్ సూరజ్ పార్టీ ఏర్పాటు చేయడానికి ముందు ప్రశాంత్ కిషోర్ మే 5, 2022 నుండి అక్టోబర్ 2, 2024 వరకు 6,000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆయన 5,000 గ్రామాలకు చేరుకుని 5,000 సమావేశాలు నిర్వహించారు. బీహార్ అంతటా తిరుగుతూ గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మే 2022 నుండి 1,280 రోజుల పాటు బీహార్ మొత్తాన్ని గాలించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఎన్నికల ప్రచారాన్ని రోడ్డు మార్గంలోనే నిర్వహించారు. అక్టోబర్ 21 నుండి ప్రతిరోజూ సగటున 200 కి.మీ. ప్రయాణించానని పీకే చెప్పారు.

## ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరం

ఎస్ఐఆర్ అంశంలో ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రజలలో గందరగోళం నెలకొందని టీవికే అధినేత, ప్రముఖ నటుడు విజయ్ అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను విడుదల



చేశారు. ప్రజలు, ముఖ్యంగా జెన్-జెడ్ ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత నవీకరించబడిన ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు ఒకటని విజయ్ పేర్కొన్నారు. ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరమని అన్నారు. ఓటు హక్కు లేకపోతే మన ప్రజాస్వామ్యం అసంపూర్ణమే అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్ నేపథ్యంలో చాలామంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ప్రచురించే ఓటరు జాబితాలో మన పేర్లు కనిపిస్తేనే ఓటు వేయగలమని గుర్తుంచుకోవాలని సూచించారు. తమిళనాడులో 6.36 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, కానీ ఎస్ఐఆర్ ప్రక్రియను నెలలోపు ఎలా పూర్తి చేయగలుగుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి వరకు తమ పార్టీకి చెందిన చాలామందికి ఫారమ్‌లు అందలేదని అన్నారు. అందుకే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భౌతిక ఫారమ్ అందుకోలేని వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్పుడే ఓటరు జాబితాలో మన పేరు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. యువత ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరగవచ్చని ఆయన హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో జెన్ జెడ్ ఓటర్లు నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారని, అందుకే వారికి జాబితాలో చోటు లేకుండా ప్రయత్నాలు చేయవచ్చని అన్నారు. ఓటు అనేది అత్యంత శక్తిమంతమైన ప్రజాస్వామ్య సాధనమని గుర్తుంచుకోవాలని ఆయన ఉద్బోధించారు. మన ఓటు మన ప్రజాస్వామ్య ఆయుధమని పేర్కొన్నారు. "జెన్ జెడ్ ఒక శక్తి. వారు అప్రమత్తంగా ఉండాలి. అంతా మంచి జరుగుతుంది. విజయం ఖాయం" అని విజయ్ తన వీడియోను ముగించారు.

## ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు.. బీజేపీ, జేడీ(యూ)కి దక్కిన సీట్లు



**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘటబంధన్ కూటమికి నేతృత్వం వహించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)కే ఎక్కువ ఓట్లు పోల్ అయ్యాయి. అయితే ఎన్డీయే కూటమికి చెందిన బీజేపీ, జేడీ(యూ)కు అత్యధిక సీట్లు దక్కాయి. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీఏ కూటమి 202 స్థానాలు గెలుచుకున్నది. చెరో 101 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 89 సీట్లు, నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) 85 సీట్లు గెలుచుకున్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 19 సీట్లు, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) 5 సీట్లు, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా 4 సీట్లలో విజయం సాధించాయి.

కాగా, మహాఘటబంధన్ కూటమికి నేతృత్వం వహించిన ఆర్జేడీ 144 స్థానాల్లో పోటీ చేసింది. అయితే 25 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ 61 సీట్లలో పోటీ చేయగా కేవలం 6 స్థానాల్లో గెలుపొందింది. సీపీఐ(ఎంఎల్) రెండు సీట్లు, సీపీఐ(ఎం) ఒక సీటు దక్కించుకోగా సీపీఐ ఏదీ గెలుచుకోలేదు. దీంతో మహాఘటబంధన్ కూటమి 35 సీట్లకే పరిమితమైంది. మరోవైపు ఓటు శాతాన్ని పరిశీలిస్తే బీహార్ ప్రజలు ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు వేశారు. ఆ పార్టీ 23 శాతం ఓట్లు సాధించింది. అయితే గత ఎన్నికల్లో 23.11 శాతం ఉండగా ఈసారి స్వల్పంగా తగ్గింది. 144 స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీకి మొత్తం 1,15,46,055 ఓట్లు పోలయ్యాయి. అయితే కేవలం 25 సీట్లలోనే ఆ పార్టీ విజయం సాధించింది. సుమారు 42 సీట్లు స్వల్ప ఓట్ల తేడాతో కోల్పోయింది. కాగా, బీజేపీ ఓట్ల శాతం ఈసారి మరింత పెరిగింది. 2020 ఎన్నికల్లో 19.46 శాతం ఉండగా ఈసారి 20.07 శాతానికి పెరిగింది. గత ఎన్నికల్లో 110 నియోజకవర్గాల్లో పోటీ చేసిన బీజేపీ ఈ ఎన్నికల్లో 101 సీట్లకే పరిమితమైంది. అయినప్పటికీ 1,00,81,143 మంది ఓటర్లు బీజేపీకి ఓటు వేశారు. జేడీ(యూ)కు 19.25 శాతం ఓట్లు పోలయ్యాయి.

## నౌగామ్‌లో పేలుడు ఉగ్రకుట్ర కాదు.. ప్రమాదమే

జమ్ము కశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడులో 9 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ పేలుడు వెనుక ఉగ్రవాద కుట్ర ఉందన్న ప్రచారంపై రాష్ట్ర డీజీపీ నళిన్ ప్రభాత్ స్పందించారు. ఉగ్రవాద కుట్ర ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని ఆయన వెల్లడించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర



మాడ్యూల్‌ను ఛేదించిన అధికారులు, అక్కడి నుంచి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి నుంచి నమూనాలు (శాంపిల్స్) సేకరిస్తుండగా భారీ విస్ఫోటనం జరిగింది. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని భావించినప్పటికీ, జైషేకు అనుబంధ సంస్థ అయిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ ఈ దాడి తమ పనేనని ప్రకటించింది. అయితే డీజీపీ దీనిని ఖండించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని స్పష్టం చేశారు. డీజీపీ మీడియాతో మాట్లాడుతూ, ఫరీదాబాద్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించేందుకు సిద్ధం చేశామన్నారు. ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ, దురదృష్టవశాత్తు పేలుడు సంభవించిందని తెలిపారు. మృతి చెందిన తొమ్మిది మందిలో ముగ్గురు ఫోరెన్సిక్ సిబ్బంది, రాష్ట్ర వైద్య సంస్థకు చెందిన ఒకరు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ఒక టైలర్ ఉన్నారని ఆయన పేర్కొన్నారు. 32 మంది గాయపడగా, వారికి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ పూర్తిగా దెబ్బతిన్నదని, సమీపంలోని భవనాలు కూడా ప్రభావితమయ్యాయని ఆయన తెలిపారు. నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, 27 మంది పోలీసులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారని పేర్కొంది. నౌగామ్ పేలుడుపై మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (జమ్ము కశ్మీర్ డివిజన్) ప్రశాంత్ లోఖండే మాట్లాడుతూ, పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనంతో పాటు చుట్టుపక్కల ఉన్న కొన్ని నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

# కారు గ్యారేజీకేనా...




**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణులను మరింత కుంగ దీశాయి. సిట్టింగ్ స్థానాలను రెండింటిని గత రెండేళ్లలో కోల్పోవడం కూడా క్యాడర్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసింది. ఈ ఓటములకు కారణం అభ్యర్థులు కాదు.. కేవలం పార్టీ నాయకత్వమేనని స్పష్టంగా చెప్పాలి. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెలలు తిరగక ముందే ఆమె మరణించడంతో సాయన్న మరో కుమార్తె నివేదితను పోటీకి దింపారు. కానీ నాడు ఆ ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో గెలవగా, మూడో స్థానానికి బీఆర్ఎస్ పరిమితమయింది. ఇప్పుడు కూడా అన్ని పార్టీల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిని బీఆర్ఎస్ ప్రకటించింది. తమ పార్టీకి చెందిన మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అభ్యర్థిగా ప్రకటించారు. అయినా రెండుసార్లు బీఆర్ఎస్ గెలుపు సాధించలేదు. అంటే ఇక్కడ అభ్యర్థుల కంటే నాయకత్వాన్ని మాత్రమే ప్రజలు చూశారని చెప్పాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రజా సమస్యలపై పెద్దగా బయటకు రావడం లేదు. అప్పుడప్పుడు బయటకు వచ్చి వెళ్లడం తప్ప ఆయన ఎక్కువగా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఆరోగ్యం పరిస్థితులు కూడా ఆయనను బయటకు రానివ్వడం లేదు. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నీ తన భుజాల మీద వేసుకుని చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. అయితే ప్రచారంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరొకటి లేకుండాఉంది... పోల్ మేనేజ్ మెంట్ లో బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా విఫలమయింది. కారుకు, బుల్ డోజర్ కు మధ్య పోటీ అంటూ పదే పదే ప్రచారం చేసినా ఆక్రమణల విషయంలో ప్రజలు బుల్ డోజర్ వైపు మొగ్గు చూపారనుకోవాలి. డబ్బులు తక్కువ ఖర్చు పెట్టలేదనుకోవడం పొరపాటే. కాంగ్రెస్ తో పోటీ పడిందనే చెప్పాలి. అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీషీటర్ అని ప్రచారం ఒక పక్క చేస్తూ మరికొందరి రౌడీషీటర్లకు పార్టీ కండువాలు కప్పడం కూడా బీఆర్ఎస్ చేసిన తప్పిదాల్లో ఒకటి. ఇక సీమాంధ్ర ఓటర్లను ఆకట్టుకోవడంలో కూడా కేటీఆర్ విఫలమయ్యారు. టీడీపీ తటస్థంగా ఉండటం కూడా కాంగ్రెస్ కు లాభించింది. బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో కేసీఆర్ వ్యవహరించిన తీరును, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రజలు బేరీజు వేసుకున్నట్లే ఉంది. నాడు కేసీఆర్ జనాలకు దగ్గరగా వచ్చే వారు కాదు. ఏ కార్యక్రమానికి హాజరయ్యే వారు కాదు. కానీ మొన్న తెలంగాణ కవి అందెశ్రీ మరణించినసమయంలో రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు కూడా అందరినీ కట్టిపడేసింది. ఇలా అనేక కారణాలు కారు కు హ్యాండ్ బ్రేక్ వేసినట్లయింది. మొత్తం మీద కేటీఆర్ చెప్పినట్లుగా తమను ప్రత్యామ్నాయంగా ప్రజలు చూస్తున్నారని చెప్పేకంటే ఎలా బలోపేతం కావాలో అవసరమైన చర్యలతో జనం ముందుకు వెళ్లాలి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలే తమను గెలిపిస్తాయని భావిస్తే మాత్రం జరిగే ఏ ఎన్నికల్లోనైనా కారు పార్టీకి భంగపాటు తప్పదన్నవిషయాన్ని గుర్తుంచుకోవాలి. వచ్చేస్థానిక సంస్థలఎన్నికల్లోనైనా, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకోకుండా వ్యవహరిస్తే మరోసారి ఓటమిని రుచిచూడక తప్పదని గుర్తుంచుకుంటే మంచిది.

పోరాటం కొనసాగుతుంది

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఎన్నికలు తమకు కొత్త ఉత్సాహాన్నితెచ్చాయన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తామే ప్రధాన ప్రత్యర్థి అని తేల్చిచెప్పినట్లయిందని కేటీఆర్ అన్నారు. తాము గత శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయినప్పటికీ ప్రజా సమస్యలపై స్పందించామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు చెప్పినట్లయిందని కేటీఆర్ అన్నారు. గెలుపు, ఓటములు పక్కన పెడితే ప్రజాస్వామ్యంపై చర్చ జరగాలని అన్నారు. ఈ ఎన్నిక ఎలా జరిగిందన్నది ప్రజల్లో కూడా చర్చ జరగాలన్నారు. ఎన్నికలకు ముందే తాము అనేక విషయాలు బయటకు తెచ్చినా ఎన్నికలకమిషన్ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని,దొంగ ఓట్లు పోలయ్యాయని చెబుతున్నాఎవరూ తమ మొరను వినలేదన్నారు. ఈ ఓటమితో తాము నిరాశ చెందడం లేదని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వెళతామని కేటీఆర్ చెప్పారు.

# అంతా తానై చేసిన రేవంత్



**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఎవరికి ఎటువంటి అంచనాలు లేవు. చివరికి ఆ పార్టీలో ఉన్న ముఖ్య నాయకులకు కూడా ఏమాత్రం ఆశ లేదు. ఎందుకంటే జూబ్లీహిల్స్ గడిచిన రెండు పర్యాయాలుగా గులాబీ పార్టీకి జై కొట్టింది. పైగా మాగంటి గోపీనాథ్ కు అక్కడ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. దీనికి తోడు సునీతకు సింపతి ఓట్లు పడతాయని నమ్మకం ఉంది. పైగా గులాబీ పార్టీ సోషల్ మీడియా వింగ్, మీడియా వింగ్ విపరీతంగా ప్రచారం చేశాయి. కేటీఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తనే పోటీ చేస్తున్నట్టుగా రంగంలోకి దిగాడు. రేవంత్ రెడ్డిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. దీంతో గులాబీ పార్టీ గెలుస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఇక్కడే రేవంత్ రెడ్డి ఎంట్రీ ఇచ్చాడు. ఎప్పుడైతే జూబ్లీహిల్స్ స్థానంలో జరిగే ఉప ఎన్నిక తెలంగాణలో రేవంత్ రెడ్డి పరిపాలనకు రెఫరెండం అని చెప్పాడో .. అప్పుడే రేవంత్ దీనిని అత్యంత సీరియస్ గా తీసుకున్నాడు. ఆ తర్వాత కథ మొత్తం తను నడిపించాడు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ అనే బిసి వ్యక్తిని ప్రకటించడం ద్వారా రేవంత్ గేమ్ తనవైపు తిప్పుకున్నాడు. పైగా నవీన్ ఉన్నత విద్యావంతుడు. ఓడిపోయినప్పటికీ.. గెలిచినప్పటికీ తను అక్కడే ఉంటాడు. పైగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీ మూమెంట్ విపరీతంగా ఉంది. పైగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో బీసీ ఓట్లు చాలా ఎక్కువగా ఉంటాయి.జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని రేవంత్ మాట ఇవ్వడం.. కమ్మ ఓటర్లతో మీటింగ్లు పెట్టాడు. పైగా చంద్రబాబు నిశ్శబ్దంగా ఉన్నాడు. దీంతో కమ్మ ఓటర్లు కాంగ్రెస్ కు జై కొట్టారు. జనసేన కూడా తెర వెనుక మద్దతు ఇవ్వడంతో కాపు ఓట్లు కూడా కాంగ్రెస్ పార్టీకి పడ్డాయి. మజ్లీస్ మద్దతు ఇచ్చినప్పటికీ.. రేవంత్ ఏమాత్రం నమ్మలేదు. అత్యంత వ్యూహాత్మకంగా అజరుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకున్నాడు. అంతేకాదు ముస్లింలకు స్మశాన వాటిక ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇక్కడ గులాబీ పార్టీకి సంబంధించిన మైనారిటీ ఓటు బ్యాంకు మొత్తాన్ని చీల్చి పడేశాడు రేవంత్.సీనియర్లతోపాటు జూనియర్ మంత్రులకు అనేక ప్రాంతాల బాధ్యతలు అప్పగించాడు. అన్నిటికంటే ముఖ్యంగా టార్గెట్ ఫిక్స్ చేశాడు. దీనికి తోడు పోల్ మేనేజ్మెంట్ విషయంలో రేవంత్ ఏ మాత్రం రాజీ పడలేదు. ఇక సానుభూతిని బ్రేక్ చేయడానికి గతంలో ఏకగ్రీవం విధానం ఉంటే.. దానిని కేసీఆర్ ఎలా బద్దలు కొట్టాడో రేవంత్ వివరించాడు. పి జనార్దన్ రెడ్డి కుటుంబానికి ఎలాంటి ద్రోహం చేశాడో ఉదాహరణలతో చెప్పాడు. పిజెఆర్ పేరు వాడుకున్నాడు. మాగంటి కుటుంబానికి సానుభూతి దక్కకుండా గండి కొట్టాడు. ముఖ్యంగా కెసిఆర్ అవకాశవాదాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టాడు.సినీ కార్మికుల ఓట్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో అధికంగా ఉంటాయి. దీంతో వారితో సమావేశం ఏర్పాటు చేశాడు రేవంత్. అప్పటికప్పుడు వారికి 10 కోట్లు ఇస్తానని ప్రకటించాడు. 20% వాటా సినీ కార్మికులకు ఇస్తేనే టికెట్ రేట్లు పెంచుతానని ప్రకటించాడు రేవంత్. తద్వారా సినీ కార్మికులకు కూడా అత్యంత దగ్గరగా కనెక్ట్ అయిపోయాడు.. గులాబీ పార్టీకి ఓటు వేస్తే ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు మొత్తం ఆగిపోతాయని రేవంత్ ప్రచారం చేసాడు. అంతేకాదు గులాబీ పార్టీ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో వివరించాడు. సునీత పట్ల ప్రజలకు పెద్దగా ఆదరణ లభించకుండా ఉండడానికి కవిత అంశాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. ఇంటి ఆడబిడ్డ నే కేటీఆర్ పట్టించుకోవడంలేదని.. మాగంటి సునీతను మాత్రం ఏం పట్టించుకుంటారని రేవంత్ ప్రశ్నించాడు. పైగా కవిత చేస్తున్న ఆరోపణలను పదే పదే ప్రస్తావించాడు.మాగంటి మరణం పై ఆయన మాతృమూర్తి, మొదటి భార్య సునీత మీద కేసు పెట్టిన విధానాన్ని పదే పదే ప్రస్తావించారు రేవంత్ రెడ్డి. అదే కాదు కేటీఆర్ అవకాశవాదాన్ని వివరించారు. ఒక రకంగా సునీత మాగంటి గోపీనాథ్ ను లీగల్ గా పెళ్లి చేసుకోలేదు అనే విషయాన్ని జనాల్లోకి బలంగా తీసుకెళ్లగలిగాడు.వాస్తవానికి కాంగ్రెస్ పార్టీలో రేవంత్ పని అయిపోయిందని గులాబీ పార్టీ మీడియా, దాని అనుబంధ సోషల్ మీడియా గ్రూపులు విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి . ప్రచారానికి తోడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూడా రకరకాలుగా లీకులు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి మీద విమర్శలు చేస్తున్నారు. వారందరికీ ఈ గెలుపు ద్వారా బలమైన సమాధానం చెప్పగలిగాడు రేవంత్.ఇదే సమయంలో అధిష్టానానికి బలమైన సమాధానం కూడా ఇచ్చాడు. కాంగ్రెస్ కాదు.. కాంగ్రెస్ పార్టీకే రేవంత్ రెడ్డి చాలా అవసరం అనే విధంగా సంకేతాలు ఇవ్వగలిగాడు. అందువల్లే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో జరిగిన ఉప ఎన్నికను అత్యంత కఠినమైన సవాల్ లాగా తీసుకున్నాడు. విపరీతంగా కష్టపడ్డాడు. ఒక ప్లానింగ్ ప్రకారం ముందుకు పోయాడు. అన్నట్టు ఈ ఎన్నికను తెలంగాణ ప్రభుత్వానికి రెఫరెండం అని కేటీఆర్ అన్నాడు. ఈ ప్రకారం చూసుకుంటే తెలంగాణ ప్రభుత్వం పాసైనట్టే కదా.. ముఖ్యమంత్రిగా రేవంత్ విజయవంతమైనట్టే కదా..

## ఆ రంగాల్లో వచ్చే ఏడాదిలోపు వేలల్లో ఉద్యోగాలు..

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం!

**హైదరాబాద్ :** తెలంగాణను 2030 నాటికి దేశ 'ఏరో ఇంజిన్ రాజధాని'గా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ స్పష్టమైన దిశ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గచ్చిబౌలి ఐఎస్బీ లో జరిగిన 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన మార్పులను తెలంగాణ తనకు అనుకూలంగా మార్చుకునే దిశగా పనిచేస్తుందన్నారు.గచ్చిబౌలి ఐఎస్బీ లో సమ్మిట్‌ను కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, ఐఎస్‌బీ, ముంజాల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ కలిసి నిర్వహించిన 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌కు తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన మార్పులను తెలంగాణ తనకు అనుకూలంగా మార్చుకునే దిశగా పనిచేస్తుందన్నారు. ప్రపంచంలో గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతున్న సందర్భంలో నమ్మకమైన తయారీ కేంద్రాల కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోందని, ఇది తెలంగాణకు పెద్ద అవకాశమని అన్నారు. గతేడాది దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1.5 లక్షల కోట్లను దాటడం, రక్షణ ఎగుమతులు 12 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ శక్తిని సూచిస్తోందని వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం కీలక భాగం కానుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కి పైగా అంతర్జాతీయ, జాతీయ ఏరోస్పేస్ డిఫెన్స్ కంపెనీలు, 1,500కి పైగా ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి తీసుకెళ్తున్నాయని తెలిపారు.రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023?24లో రూ. 15,900 కోట్లుగా ఉండగా, 2024?25లో తొలి తొమ్మిది నెలల్లోనే రూ. 30,742 కోట్లకు పెరగడం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల విజయాన్ని చూపిస్తోందని మంత్రి చెప్పారు. ఆదిభట్లలో టాటా, సాఫ్రాన్ రూ. 425 కోట్ల విలువైన యంత్రాంగం ఇటీవల ప్రారంభమైందని, త్వరలోనే జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ రూ. 800 కోట్లతో యూఏవీ తయారీ కేంద్రం, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ రూ. 500 కోట్లతో డిఫెన్స్ ఫెసిలిటీ కూడా ప్రారంభంకానున్నాయని వెల్లడించారు. ఇంకా పలువురు దిగ్గజ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయని మంత్రి తెలిపారు.

## నవీన్ యాదవ్‌కు రాహుల్ అభినందనలు

-మొదటిపేజీ తరువాయి

ప్రధానంగా జూబ్లీహిల్స్ గెలుపు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై నేతలు చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ విజయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డిపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తితో ఉందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ కావడం ఆ ఊహాగానాలకు తెరదించినట్లయింది. ఈ సమావేశం ద్వారా పార్టీలో నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉందని అధిష్ఠానం సంకేతాలు పంపినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఫ్యూచర్ సిటీ.. భూ బ్యాంకుపై సర్కార్ ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మంచాల, కడ్తాల్, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి తదితర మండలాల్లో భూ బ్యాంకును సిద్ధం చేస్తున్నారు. ఆయా మండలాల్లో 250 ఎకరాలున్న గ్రామాలు, సర్వే నంబర్లను గుర్తిస్తున్నారు. ఎంత మంది అసైన్డ్ రైతులున్నారు.. కబ్జాలో ఉన్న వారెందరు.. ఆ భూములు చదునుగా ఉన్నాయా.. గుట్టలు, రాళ్లు, రప్పలతో ఉన్నాయా అనే విషయాలపై గూగుల్ మ్యాప్‌లతో నివేదిక సిద్ధం చేస్తున్నారు. చెరువులు, కుంటలున్నాయా.. సాగుకు యోగ్యమైనది ఎంత అనే విషయాలపై భూములను పరిశీలిస్తున్నారు.

గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో..

ప్రభుత్వం ఫోర్త్‌సిటీని నిర్మించే విషయంలో ప్రపంచ స్థాయిలో పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్‌పేటలో వచ్చే నెల 8,9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. పారిశ్రామికవేత్తలు తమ సంస్థల ఏర్పాటుకు అడిగిన వెంటనే కావాల్సిన భూమిని అప్పగించేందుకు అధికార యంత్రాంగం భూ బ్యాంకును సిద్ధం చేస్తోంది. యాచారం మండల పరిధిలోని యాచారం, మొండిగౌరెల్లి, చింతుల్ల, చింతపట్ల, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూములున్నట్లు గుర్తించారు.

మంచాల, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో వందలాది ఎకరాలున్నట్లు లెక్కలు వేశారు. భూ బ్యాంకు సిద్ధంపై ఓ రెవెన్యూ అధికారిని 'సాక్షి' సంప్రదించగా నిజమేనని తెలియజేశారు. మరోవైపు భూ బ్యాంకు కోసం అధికార యంత్రాంగం ఉరుకులు, పరుగులు పెడుతుండటంతో ఆయా గ్రామాల్లోని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జీవనోపాధి పొందే భూములను సేకరిస్తే బతికేది ఎలా అని ఆందోళన చెందుతున్నారు.

## రేవంత్ సైలెంట్ వార్నింగ్

-మొదటిపేజీ తరువాయి

ఇక చెక్కు చెదరని విధంగా ఉందన్నది మరోసారి అర్థమయింది. ఆయన ప్రత్యర్థులకు రేవంత్ ఈ రకంగా జవాబు చెప్పినట్లయింది.

బాధ్యత పెరిగిందన్న రేవంత్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుపై ఆయన మాట్లాడారు. గెలిస్తే గెంతులేయడం, ఓడిపోతే కుంగిపోవడం కాంగ్రెస్ పార్టీ నైజం కాదని అన్నారు. ఈ గెలుపు ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో సీట్లు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అదే సమయంలో రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ హైదరాబాద్ నగరంలో గెలిచిందని అన్నారు. కేంద్రం ప్రభుత్వం నిధులు రాబట్టుకునేందుకు కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని అన్నారు. జంటనగరాల్లో మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన కోరుకున్నారని అన్నారు. కేటీఆర్ అహంకారం తగ్గించాలని కోరారు. హరీశ్ రావు అసూయను, కేటీఆర్ అహంకారాన్ని ప్రజలు తీసుకోలేకపోతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా సమస్యలపై తగిన సూచనలు ఇవ్వాలని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే ప్రయోజనం లేదని అన్నారు. కిషన్ రెడ్డి అభ్యర్థిగా మారి ప్రచారం చేసినా పదిహేడు వేల ఓట్లు మాత్రమే వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బీజేపీకి డిపాజిట్లు గల్లంతయ్యాయని అన్నారు. తమ పరిపాలనలో తీసుకున్న నిర్ణయాలకు ప్రజల ఆమోదం లభించిందని చెప్పారు. . అధికారం శాశ్వతం కాదని, రాజకీయం వారసత్వం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఫేక్ సర్వేల ద్వారా లబ్దిపొందాలనుకుంటే ప్రయోజనం ఉండదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఓట్ల శాతం పెరిగిందని, గత శాసనసభ ఎన్నికల్లో వచ్చిన దానికంటేపార్లమెంటు ఎన్నికల్లోనూ, ఉప ఎన్నికల్లోనూ ఓట్ల శాతం పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు కలసి కట్టుగా పనిచేస్తేనే ఇంతటి ఘన విజయం సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజలు అభివృద్ధి సంక్షేమాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

## డైలమాలో కమలం

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఎదురైన ఓటమి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు వాస్తవ పరిస్థితిని తెలిసేలా చేసినట్టుంది. జూబ్లీహిల్స్ ఫలితం వెలువడిన తర్వాత కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సాధారణంగా కేటీఆర్ రేవంత్ రెడ్డి ప్రస్తావన వస్తే చాలా పరుషమైన పదజాలం వాడుతుంటారు. అంతకుముందు అధికారంలో ఉన్నప్పుడు కూడా భారతీయ జనతా పార్టీ నాయకుల మీద ఇదే స్థాయిలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసేవారు. పరుషమైన పదజాలం వాడేవారు. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంటు, కంటోన్మెంట్ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ కేటీఆర్ తన ధోరణి మార్చుకోలేదు.ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలోనూ కేటీఆర్ అదే స్థాయిలో దూకుడు కొనసాగించారు. తన అభ్యర్థిగా విస్తృతంగా ప్రచారం చేశారు.. ప్రధాన మీడియాకు విస్తృతంగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఇతర మాధ్యమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ స్థాయిలో కేటీఆర్ మీడియాను వాడుకున్నప్పటికీ.. ఉపయోగం లేకుండా పోయింది. పైగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ సరికొత్త బెంచ్ మార్క్ సృష్టించారు. మెజారిటీలో సరికొత్త రికార్డులను నెలకొల్పారు.గులాబీ పార్టీ ఓడిపోయిన తర్వాత కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. అయితే ఈసారి వాస్తవంలోకి వచ్చి కేటీఆర్ అసలైన విషయాలను చెప్పారు. 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ పార్టీకి 0 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ చేరి సమానంగా పార్లమెంటు స్థానాలను దక్కించుకున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని కమలం పార్టీ నాయకులు ప్రచారం చేసుకున్నారు. కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు వచ్చేసరికి కమలం పార్టీ నాయకులు చెప్పింది మొత్తం అబద్ధమని తేలిపోయింది . అంతేకాదు కమలం స్థానం కూడా మూడో స్థానానికి దిగజారిపోయింది.సరిగా ఏడాదికి మించి సమయం గడిచిన తర్వాత తెలంగాణలో పరిస్థితులు మారిపోయాయి. బిజెపి స్థానంలోకి గులాబీ పార్టీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టి.. ఆస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. కానీ బిజెపి మాత్రం తన రెండవ స్థానాన్ని గులాబీ పార్టీకి త్యాగం చేసింది. ఇదే అర్థం వచ్చేలా కేటీఆర్ మాట్లాడారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ద్వారా.. వచ్చిన ఓట్ల ద్వారా తాము సంతృప్తితో ఉన్నామని.. కాంగ్రెస్ పార్టీకి తామే ఆల్టర్నేటివ్ అని తెలంగాణ ప్రజలు గుర్తించారని కేటీఆర్ పేర్కొన్నారు.. కేటీఆర్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు. ఇక ఇప్పుడు ఆలోచించుకోవాల్సింది కమలం పార్టీ నాయకులే.

# సంపాదకీయం

## బిహార్ ఫలితాలు దేశ రాజకీయాలపై ప్రభావం

బిహార్ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలపై ముఖ్య ప్రభావం చూపనున్నాయి. ఎన్డీయే స్పష్టమైన విజయంతో కూటమికి మరింత బలం చేకూరింది. జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపే సుదీర్ఘ రాజకీయ వారసత్వం గల ఈ రాష్ట్రంలో, 243 స్థానాల కోసం ఎన్నికలు జరిగాయి. నితీశ్ కుమార్ నాయకత్వంలో అభివృద్ధి, యువత, మహిళల ఓటర్ల మద్దతుతో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. ఎన్నడూ లేని విధంగా ఎన్డీయే కూటమి డబుల్ సెంచరీ సాధించడం అద్భుతమైన విషయం. బిహార్ ఎన్నికల్లో ఇంతటి విజయం సర్వేలతో సహా ఎవరూ ఊహించలేదు. ఎన్ని ఆరోపణలు వెల్లువెత్తినా ఓటర్లు అత్యధికంగా ఎన్డీయే వైపు మొగ్గు చూపడం విశేషం. భారతదేశంలోని అత్యంత రాజకీయ ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాల్లో బిహార్ మీద అందరి దృష్టి నిలిచింది. జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపే సుదీర్ఘ రాజకీయ వారసత్వం గల ఈ రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. సుమారు 69 పార్టీలు పోటీచేసిన ఈ ఎన్నిక, దేశంలో అత్యంత పోటీతత్వంతో కూడినట్లుగా నిలిచింది. మహాగఠ్‌బంధన్ ప్రజా సంక్షేమాన్ని తన ఎజెండాలో ప్రధానంగా ఉంచినప్పటికీ, ఓటర్లకు అభివృద్ధి - ఆధారిత విధానం ఎక్కువ ఆకర్ష ణీయంగా ఉండిందని. ఫలితాలు సూచిస్తున్నాయి, భవి ష్యత్తులో బిహార్ 'అభివృద్ధి-కేంద్రీకృత' పాలన వైపుగా కొనసాగుతుంది. పైగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా అభివృద్ధి కేంద్రిక వ్యూహాలు మరింత ప్రాధాన్యం పొందవచ్చు. ఏ రకంగా చూసినా ఇది ఎన్డీయే కూటమికి అపూర్వ విజయం అనే చెప్పాలి. ప్రశాంత్ కిశోర్ ప్రారంభించిన జన సురాజ్ ఉద్యమం కొత్త రాజకీయ వేదికగా నిలిచింది. అభివృద్ధి ఆధారిత ప్రజాధారిత పాలనకు ప్రతిపాదించిన ప్రయత్నాలు, ఎక్కువ సీట్లు దక్కకపోయినా ఓట్లను చీల్చడంలో ప్రభావం చూపాయి. ఇక అలాగే ఓటర్ జాబితా సవరించిన తర్వాత కొత్త ఓటర్లు, యువ ఓటర్లు, వలస తిరిగి వచ్చిన ఓటర్లు ఎక్కువగా పాల్గొన్నారు. ఈ కారణంగా 64.66% పోలింగ్ నమోదైంది. ఇది రాష్ట్రంలో అత్యధికం. ఎన్డీయే మేనిఫెస్టో ప్రధాన దృష్టి అభివృద్ధి, పరిశ్రమలు, టెక్నాలజీ ఆధారిత పాలన, ఉద్యోగాలు 1 కోటి ప్రభుత్వ ఉద్యోగాల హామీస్కిల్ డెవలప్‌మెంట్, మెగా స్కిల్ సెంటర్లు, యువతను నైపుణ్యవంతులుగా తయారు చేయడం మహిళా సాధికారత, లఖ్‌పతి దీదీలు, మిషన్ క్రోర్‌పతి పథకాలు, రైతులు, వ్యవసాయ ఎగుమతుల పెంపు, పెట్టు బడుల ద్వారా మద్దతు ఆరోగ్యం, హాస్పిటల్స్, మౌలిక సదుపాయాలు, అవినీతి వ్యతిరేక విధానం, అభివృద్ధి ఆధారిత పారదర్శక పాలన పెట్టుబడులు, టెక్నాలజీ, ?50 లక్షల కోట్ల పెట్టుబడులు, పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తున్నారు. మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టో ప్రధానంగా ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, ఉద్యోగాలపైనే ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం హామీ స్కిల్ డెవలప్‌మెంట్ విద్యా ర్థులకు ఉచిత సేవలు, కళాశాలలు మహిళా సాధికారత, మై-బెహిన్ యోజన, హీూ×-దీజు× పథకాలు రైతుల కోసం పంట మద్ధతు ధర హామీ, అన్ని పంటలకు?25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా, ఓపీఎస్ పునరుద్ధరణ, ఉచిత విద్యుత్, పెన్షన్లు అవినీతి వ్యతిరేక విధానం జీరో టాలరెన్స్ పెట్టుబడులు అండ్ టెక్నాలజీ, ప్రభుత్వ వ్యయ ఆధారిత సంక్షేమం, హౌసింగ్, రోడ్లు, సామాజిక సేవలు రెండు మేనిఫెస్టోలు ఉద్యోగాలు మహిళా సాధికారతపై దృష్టి పెట్టినా, ఆ రాష్ట్ర ఓటర్లు ఈ సారి అభివృద్ధి ఆధారిత విధానానికి ప్రాధాన్యం ఇచ్చారు. మహాగఠ్‌బంధన్‌లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు పొందడం వల్ల, ఫలితంగా వీ+దీ మొత్తం గెలుపు సాధించలేకపోయింది. కాంగ్రెస్ ఎక్కువ సీట్లు తీసుకోవడం వల్ల ఇతర కూటమి పార్టీల ప్రధానంగా ఆర్జేడీ కోసం సీట్లు తగ్గిపోయాయి. ఈ అసమతుల్యత కారణంగా, వీ+దీ ను విజయవంతం చేయడానికి అవసరమైన నెంబర్ చేరలేక, కూటమి పరాజయం ఎదుర్కొంది. నితీశ్ కుమార్ పాత్ర బిహార్ రాజకీయాల్లో కేవలం కుటుంబం- కుల ఆధారిత నాయకత్వంగా కాకుండా, సమగ్ర సామాజిక రాజకీయాలను ప్రతిబింబిస్తుంది. కులాన్ని ప్రధాన అంశంగా కాకుండా, మహిళల, యువత ఓట్లు ఆకర్షించారు. ఈ మూడు వర్గాలను సమన్వయంగా ప్రభావవంతంగా ఆకర్షించడంలో అతను విజయవంత మవడం వల్ల, అతని రాజకీయ శక్తి మరింత బలపడింది. బిహార్ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలపై ముఖ్య ప్రభావం చూపాయి. ఎన్డీయే స్పష్టమైన విజయంతో కేంద్రానికి బలం చేకూరింది. నితీశ్ కుమార్ నాయకత్వంలో అభివృద్ధి, యువత, మహిళల ఓటర్ల మద్దతుతో ఎన్డీయే-బీజేపీ కూటమి విజయం సాధించింది. మహాగఠ్‌బంధన్ ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా ఉంచినప్పటికీ, ఓటర్లకు అభివృద్ధి-ఆధారిత విధానం ఎక్కువ ఆకర్ష ణీయంగా ఉండిందని ఫలితాలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో బిహార్ 'అభివృద్ధి-కేంద్రీకృత' పాలన వైపుగా కొనసాగుతుంది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా అభివృద్ధి కేంద్రిత వ్యూహాలు మరింత ప్రాధాన్యం పొందవచ్చు. 2025 బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే స్పష్టమైన విజయం సాధించింది. గ్రామీణ పట్టణ ప్రాంతాల మద్దతు, యువత మహిళల ఓటు ఎన్డీయే విజయానికి కీలకంగా నిలిచాయి. రాబోయే ఐదేళ్లలో బిహార్ 'అభివృద్ధి-కేంద్రీకృత' పాలనవైపు వెళ్లనున్నట్లు సూచిస్తోంది. అత్యధిక ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనం కాదు. డబుల్ ఇంజన్ సర్కార్ బిహార్ రాష్ట్ర ప్రగతిని వేగవంతం చేసి, యువతకు ఉపాధి భరోసా ఇవ్వడం, వలసలను అరి కట్టడం, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, సర్వతోముఖ అభివృద్ధి సాధించాలి.

# మీడియా స్వేచ్ఛ ఎండమావేనా!




ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్ట కాలంలో ఉంది. భారత దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 16 వ తేదిన జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటారు. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16 వ తేదిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదిన జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది. భారత దేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్ళు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. అనేక సంవత్సరాలుగా ప్రెస్ కౌన్సిల్ పత్రికా రంగానికి ఎదురయ్యే సవాళ్లు, సమస్యల గురించి ప్రతి నవంబరు 16న సెమినార్లు నిర్వహించడం జరుగుతుంది. ఇక అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికలు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించడం కూడా జరిగింది. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పురాకపోవడం విచారకరం. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చు కొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగిపోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్ధం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే, కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా. పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగు తున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజ నాల ను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకు న్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డు పెట్టుకొని లాభాలు సంపాదిం చటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించ టంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్ను అమలు జరుపుతున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాకపోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపివేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డుకోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తుతున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్దం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకోలేని గందరగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్దాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటు లోకి రావటంతో గోబెల్సు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాడును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. స్వేచ్ఛాయు తమైన, జవాబుదారీ తనంతో కూడిన దిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం. లక్ష్య సాధనకు ప్రెస్ కౌన్సిల్ పూర్తిగా అంకితం కావాలని ఆశిద్దాం.

# శ్రీబాగ్ ఒడంబడిక నేపథ్యం

రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణకు 1937 నవంబర్ 16 వతేదీ జరిగిన శ్రీబాగ్ ఒడంబడిక నివురు గప్పిన నిప్పులా రాజుకుంటూనే ఉంది. ఎనిమిది దశాబ్దాలు దాటినా, మానని గాయంలాగా ఇప్పటికీ కెలుకుతోంది. గత కొన్ని ఏళ్లుగా నవంబర్ మాసం వస్తే రాయలసీమలో అలజడి రేగుతోంది. ఈ ఏడు సైతం సీమలో ఎవరికి వారు పలు ప్రజా సంఘాలు నవంబర్ 16 వతేదీ శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలని డిమాండ్ చేసేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులు యువత పలు పట్టణాల్లో ప్రచారంలో భాగంగా పోస్టర్లు కర పత్రాలు ఉపయోగిస్తున్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై కోస్తా ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య ఏర్పడిన అపోహలను, విభేదాలను తొలగించే ఉద్దేశంతోఉమ్మడి మద్రాసులో 1937లో నవంబరు 16న ఎనిమిది మంది సభ్యుల సమక్షంలో జరిగిన ఒప్పందమే శ్రీబాగ్ ఒడంబడిక. దీనినే పెద్ద మనుషుల ఒప్పందం అని కూడా అంటారు. దీని ముఖ్య ఉద్దేశం రాయలసీమ అభివృద్ధి, ప్రయోజనాలు. మద్రాసులో కాశీనాధుని నాగేశ్వరరావుగారి శ్రీబాగ్ మహలు లో 1937 నవంబరు 19న సమావేశమై (సర్కారాంధ్ర, రాయలసీమ) సామరస్య సాధనగా పెద్ద మనుషుల ఒప్పందం ( శ్రీబాగ్ ఒడంబడిక ) సాధించారు. ఆస్థల గౌరవార్ధం ఆ ఒడంబడికను శ్రీబాగ్ ఒడంబడికగా పిలవడం జరిగింది. ఈ ఒప్పందం వీరిమధ్య సదవగాహనను పెంపొందించి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో కోస్తా, రాయలసీమ నాయకుల మధ్య విభేదాలు ఉండేవి. 1926లో ఏర్పాటైన ఆంధ్ర విశ్వవిద్యాలయమును ఎక్కడ ఏర్పాటు చెయ్యాలనే విషయంతో ఈ విభేదాలు మొదలయ్యాయి. అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి డా. సుబ్బారాయన్ తీసుకున్న నిర్ణయాలు ఇందుకు ఇతోధికంగా తోడ్పడ్డాయి. ఆ తరువాత, 1913నుండి, 1935 వరకు జరుగుతూ వచ్చిన ఆంధ్ర మహా సభ సమావేశాలలో, ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలోను ఇవి బయటపడుతూ ఉండేవి. 1917లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభ సమావేశాలలో ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని ఓడించ డానికి రాయలసీమ, నెల్లూరు ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నించారు. 1924లో విజయవాడలో జరిగిన ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలో అధ్యక్ష పదవికి పోటీచేసిన రాయలసీమకు చెందిన నాయకుడు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావును ఆంధ్ర నాయకులు ఓడించారు. ఆనాటి రాయలసీమ రాజకీయ నాయకత్వంలో తమిళుల ప్రాబల్యం అధికంగా ఉండటం, వారు సహజంగానే ప్రత్యేకాంధ్రకు వ్యతిరేకంగా ఉండటం ఈ విభేదాలకు ఒక ప్రధాన కారణం. కేశవ పిళ్ళె, ఏకాంబర అయ్యర్ వీరిలో ప్రముఖులు. 1934 లో రాయలసీమ పరిరక్షణ పేరుతో జస్టిస్ సి. యల్. నరసింహా రెడ్డి కె. సుబ్రహ్మణ్యం చొరవతో రాయలసీమ మహాసభ ఏర్పాటు చేశారు. 1934 జనవరిలో మద్రాసులో తొలి సభ జరిగింది. కడపకు చెందిన నెమలి పట్టాభిరామా రావు సభకు అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సెంట్ మెంట్ ను వ్యతిరేకించే తమిళ కాంగ్రెస్ నేత యస్. సత్య మూర్తి సభను ప్రారంభించారు. తిరిగి 1935 సెప్టెంబర్ లో రెండవ సభ కడపలో జరిగింది. 1937 లో జరిగిన ఎన్నికల్లో జస్టిస్ నరసింహా రెడ్డి సుబ్రహ్మణ్యం ఓడి పోయారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందినది. 1937 ఎన్నికల తర్వాత ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్షులుగా భోగ రాజు పట్టాభి సీతారామయ్య ఎన్నికైనారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం తీవ్రతరం చేశారు.అయితే రాయలసీమ ప్రాంత నేతల సహకారం లేనిదే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించడం సాధ్యం కాదని కోస్తా కాంగ్రెస్ నేతలు గుర్తించారు. 1937 అక్టోబర్ లో విజయవాడలో ఆంధ్ర మహాసభ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు రాయలసీమకు చెందిన కడప కోటి రెడ్డి అధ్యక్షత వహించగా హలా హర్వి సీతారామ రెడ్డి ప్రారంభించారు. ఇరువురు కూడా రాయల సీమ నుండి శాసనసభ్యులుగా వున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు సహకరించాలంటే రాయలసీమ ప్రయోజనాలకు రక్షణ ఇవ్వ వలసినదిగా ఇద్దరూ కోరారు. ఈ మహాసభలో జరిగిన చర్చలు పరస్పరం భావాలు ఇచ్చి పుచ్చుకున్నందున శ్రీబాగ్ ఒడంబడిక కుదరడానికి పునాది రాయి పడింది. నాయకులు విభేదాలను తొలగించుకోవాలన్న నిశ్చయానికి వచ్చారు. మంత్రివర్గం ఏర్పాటు, నీటిపారుదల, రాజధాని మొదలైన విషయాలలో రాయలసీమకు రక్షణలు అవసరమన్న భావనను రాయల సీమ నాయకులు వ్యక్తపరచగా, ఈ విషయాలను పరిశీలించేందుకు ఒక సంఘాన్ని నియమించారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, హాలహర్వి సీతారామరెడ్డి, కడప కోటిరెడ్డి, కొండా వెంకట ప్పయ్య, టి. ఎన్.రామకృష్ణారెడ్డి, మహబూబ్ ఆలీ బేగ్, దేశిరాజు హనుమంత రావు, కల్లూరు సుబ్బారావు, దేశపాండ్య సుబ్బారావు, వరదాచారి, పప్పూరి రామాచారి, సుబ్బరామి రెడ్డి, ముళ్ళపూడి పల్లంరాజు తదితర సంఘ సభ్యులంతా 1937 నవంబర్ 16న మద్రాసులో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు నివాసమైన శ్రీబాగ్‌లో సమావేశమై, ఒక ఒప్పందానికి వచ్చారు. ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఆ ఇంటి పేరుమీదనే ఈ చారిత్రాత్మక ఒప్పందానికి శ్రీబాగ్ ఒడంబడిక అని పేరు వచ్చింది. రాష్ట్ర రాజధాని మద్రాసుగానీ, రాయలసీమలో ఏదో ఒక పట్టణం అయివుండాలి. శాసనసభలో రాయల సీమకు సరియైన ప్రాతినిధ్యము ఉండాలి. సరి సమాన సంఖ్యలో మంత్రు లుండాలి. ఆర్థిక వెనుక బాటు తనం మూలాన వెంటనే తుంగభద్ర, హగరి ప్రాజక్టులు చేపట్టాలి. రాష్ట్ర ఆదాయాన్ని సమానంగా పంచాలి. ఆంధ్ర యూనివర్సిటీ రెండు కేంద్రాలు ఏర్పాటు చేయడం. ఒకటి - వైజాగ్‌లో రెండవది అనంతపురంలో నెలకొల్పడం. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆర్థికాభివృద్ధి కోస్తా ప్రాంతంతో సమానంగా సాధించేందుకు తుంగభద్ర కృష్ణ, పెన్నా నదులపై నిర్మించే పెద్ద ప్రాజెక్టుల ప్రయోజ నాలు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. చట్ట సభల్లో రిజర్వేషన్ స్థానాలు మినహా జనరల్ స్థానాలు జిల్లా స్థాయిలో సమానంగా వుండాలి. రాజధాని హైకోర్టు వేర్వేరు ప్రాంతాల్లో వుండాలి. ముందు ఛాయిస్ రాయలసీమకు ఇవ్వాలి. సదరు తీర్మానాలు సభలో ప్రవేశ పెట్టడం, ఏకగ్రీవంగా ఆమోదంపొందడం జరిగింది.



# ఎక్సోటిక్ పంటలతో భవిష్యత్తులో ఆదాయాలు మెరుగు

### పర్యావరణ మార్పులను దీటుగా తట్టుకునే ఉద్యాన పంటలే ఏకైక ప్రత్యాన్మయం..

### రైతులకు మరింత లాభసాటిగా ఉండేందుకు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి..

### ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ దండా రాజిరెడ్డి







**రాజేంద్రనగర్,నవంబర్15(సూర్యరేఖ)** కేవలం పత్తి,వరితో 80శాతం పైగా వ్యవసాయం సాగుతున్న నేపథ్యంలో మారుతున్న పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు ఉద్యాన పంటల వైపు మారాల్సిన అవసరం ఉందని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాల వేదిక జరిగిన 'సుస్థిర వైవిధ్యానికి అధిక విలువ కలిగిన పండ్లు,పూల పంటలు'అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.సాగులో అధిక విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు ఉన్నాయని,అయితే వాటి దిగుబడి తగ్గడంతో పాటు,ఏక పంటల సాగు,పర్యావరణ మార్పులు నేపథ్యంలో రైతులకు మరింత లాభసాటిగా ఉండేందుకు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.సరైన సాగు పద్ధతులతో భవిష్యత్తులో పర్యావరణ మార్పులను దీటుగా తట్టుకునేందుకు ఉద్యాన పంటలే ఏకైక ప్రత్యామ్నాయమని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 650నుంచి1100 మిల్లీమీటర్ల వర్షపాతం 6నుంచి40ఉష్ణోగ్రత, వైవిధ్యమైన నేలలు ఉన్న నేపథ్యంలో అధిక విలువ కలిగిన ఎక్జోటిక్ పండ్లు,పూలకు తెలంగాణ వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని అన్నారు.ఈ పంటల సాగులో రైతులకు కావాల్సిన శాస్త్రీయ సలహాలు,సూచనలు విశ్వవిద్యాలయం అందిస్తుందని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు.ఇప్పటికే రాష్ట్రంలో కేవలం 6శాతం మొత్తం వ్యవసాయ విస్తీర్ణంలో ఉన్న ఉద్యాన పంటలు 30శాతం పైగా జీఎస్డీపీ ఇస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం దేశంలో ఎగ్జోటిక్ పండ్లు,పూలు సాగు చేయాలంటే ముందుగా వాటి సాగు పద్ధతులను స్థిరీకరించాలని,అలాగే సుస్థిర సాగు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ ఉద్యాన నిపుణులు డాక్టర్ ఎస్డి శికామణి అన్నారు. వీటి వినియోగం పెంచేందుకు,పోషక విలువలను వినియోదారులకు అందజేస్తూనే తరచుగా బయ్యర్, సెల్లర్ మీటింగ్ లో ఏర్పాటు చేయాలని,దాంతో వీటి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉందని ఆయన తెలిపారు.భవిష్యత్ ఉద్యాన పంటలుగా ఎగ్జోటిక్ పంటలు ఉన్నాయని ఎగుమతికి అలాగే రైతులు అదికాదాయం పొందడానికి ఈపంటలు ఆధారంగా ఉన్నాయని వైవితీకరణకు అధిక విలువ కలిగిన పండ్లు,పూల పంటలుపై అతిధి ఉపన్యాసం చేసిన బెంగళూరు లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.కరుణాకర్ అన్నారు.సంప్రదాయ పంటలతో పోలిస్తే ఎగ్జోటిక్ పంటల సాగుతో నాలుగు రెట్లు ఆదాయం ఉంటుందని ఆయన తెలిపారు ఎగుమతికి, విలువల జోడింపు,ప్రాసెసింగ్ కు ఈ పంటలు అత్యంత అనుకూలమైనయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం పూల పంటల సాగుకు అత్యంత అనుకూలంగా ఉందని,వీటి సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందని ఐఐహెచ్ఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.నవీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా "సుస్థిర వైవిధ్యానికి ఎగ్జోటిక్ పండ్ల తోటలు"అనే అంశంపై రచించిన పాలసీ పేపర్,లు రిలీజ్ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ భగవాన్ డీన్ డాక్టర్ చీనా,విస్తరణ సంచాలకులు డాక్టర్ టి.సురేష్,పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ,రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్,డాక్టర్ డి.అనిత కుమారి,ప్రొఫెసర్ పిడిగం సైదయ్య శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల జన్మదినం సందర్భంగా ఉచిత మెగా నేత్ర శిబిరం





**ఖమ్మం జిల్లా/కల్లూరు,నవంబర్15(సూర్యరేఖ)** సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్,ఆర్యవైశ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు,ల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పుట్టినరోజు వేడుకలు కల్లూరు కళ్యాణ టీటీడీ మండపంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తిరువూరు శంకర నేత్ర వైద్యాలయం సౌజన్యంతో "ఉచిత మెగా కంటి వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు.డాక్టర్ మట్టా దయానంద్ కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, యూత్ కాంగ్రెస్ కల్లూరు మండలం అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహరావు లక్కినేని కృష్ణ,ఏనుగు సత్యంబాబు తోటకూర శేషగిరిరావు,కల్లూరు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కన్నాల సర్వే60లోనే సమగ్ర పాఠశాలని నిర్మించాలి



**బెల్లంపల్లి,నవంబర్15(సూర్యరేఖ)** ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సమగ్ర పాఠశాలని కన్నాల శివారు సర్వేనంబర్ 60లోని ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలంటూ స్థానిక నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు.శాంతిఖని ప్రాంతంలో పాఠశాల కోసం స్థలం కేటాయిస్తున్నారన్న పుకార్లతో అక్కడ భూకబ్జాలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నదని వారు తెలిపారు.భవిష్యత్తులో సింగరేణి విస్తరణకు అవసరమైన ప్రాంతంలో పాఠశాలను నిర్మించడం అనాలోచితమని పేర్కొంటూ,ఇప్పటికే చేసిన ఫిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.కన్నాల సర్వే60లో దాదాపు యాభై ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అక్కడే పాఠశాల నిర్మించడమే సరైన నిర్ణయం అవుతుందని అభిప్రాయపడ్డారు. సమగ్ర పాఠశాల కోసం ఈ భూమినే కేటాయించాలని జిల్లా అధికారులకు,ప్రజా ప్రతినిధులకు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మనీరామ్ సింగ్, ప్రజాస్వామ్య నాయకులు,చాంద్ పాషా మహేందర్, శ్రీనివాస్ లక్ష్మణ్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపు ఆనందదాయకం....

### మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్



**మెదక్,నవంబర్15(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానంలో నవీన్ యాదవ్ కాంగ్రెస్ జెండా ఎగురవేయడం సంతోషకరమని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ అన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరో అద్భుత విజయాన్ని అందుకుందని, ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ఎన్ని రకాల దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ విజయాన్ని అడ్డుకోలేక పోయారని అన్నారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు బీసీలకు రాజకీయ ప్రాధాన్యం,సమాగ్ర హక్కులు సాధించడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని నవీన్ యాదవ్ గెలుపు ప్రజల విజయమని భాగ్యరాజ్ అన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈఓ ఎల్లయ్య..



**నిజాంపేట,నవంబర్15(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శనివారం జడ్పిసిఈఓ ఎల్లయ్య సందర్శించి రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల ఆఫీస్ సంబంధించి స్టాప్ రిజిస్టర్ పరిశీలించామని, గ్రామంలో నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్నటువంటి ఇండ్ల పురోగతి వివరాలను తెలుసుకున్నామన్నారు.ఆఫీసులో పనులు సక్రమంగా కొనసాగుతున్నాయని,పనుల విషయంలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి,ఇన్చార్జ్ ఎంపిఓ నరసింహారెడ్డి,ఎంపీడీవో సీనియర్ అసిస్టెంట్ వినయ్ కరీముల్లా నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు సంబంధించి ఆడిటింగ్..



**నిజాంపేట,నవంబర్15(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం అడిట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం గ్రామ పంచాయతీలకు సంబంధించి 2024, 2025కు ఆడిటింగ్ చేపట్టారు.ఈ కార్యక్రమంలో 14గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామ కార్యదర్శిలు పాల్గొని పనుల వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జిఎంపీఓ నరసింహారెడ్డి, కార్యదర్శులు మహమ్మద్ హరిఫ్ హుస్సేన్, రాము,నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

## సీసీ కెమెరాల రిపేర్ నిమిత్తం రూ.10వేలు అందించిన మాజీ సర్పంచ్..




**నిజాంపేట,నవంబర్15(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గతంలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఇట్టి సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో సీసీ కెమెరాలు రిపేరు కొరకు గ్రామ తాజా మాజీ సర్పంచ్ చప్పేట నరసింహారెడ్డి, తన వంతు సహాయంగా రూ.10 వేలను హెడ్ కానిస్టేబుల్ మురళీధర్,కు అందించారు.గ్రామంలో సీసీ కెమెరాలో ఏర్పాటుతో దొంగతనాలు తగ్గాయన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పర్ష రాములుగౌడ్,రైటర్ రాజు,తదితరులు ఉన్నారు.

# బిర్సాముండా ఆశయాలు ఆదర్శాలు తరతరాలకు స్ఫూర్తిదాయకం

**చిల్కానగర్ డివిజన్ బిజెపి మాజీ అధ్యక్షులు గోనే శ్రీకాంత్**



**ఉప్పల్,నవంబర్15(సూర్యరేఖ)** భగవాన్ బిర్సాముండా 150వ జయంతి పురస్కరించుకుని బిజెపి చిల్కానగర్ డివిజన్ శాఖ అధ్యక్షులు దప్పు దత్తసాయి ఆధ్వర్యంలో చిల్కానగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మాజీ డివిజన్ అధ్యక్షులు గోనె శ్రీకాంత్ మాట్లాడుతూ... వలసపాలకుల గుండెల్లో వణుకు పుట్టించిన మహా తిరుగుబాటు నాయకుడు భగవాన్ బిర్సా ముండా తెల్లదొరలపై జగల్ తుఫానులా అగ్నిజ్వాల తిరగబడిన ఆగిరిజన సింహం చరిత్ర కేవలం గతం కాదన్నారు.అది గిరిజన ప్రజల గౌరవానికి, ఆత్మగౌరవాన్నీకి అంచెలంచెల సంకల్పం15వ శతాబ్దంలో "జల్-జగల్-జీమీన్"కోసం ఆయన చేసిన మహా తిరుగుబాటు తరతరాలుగా దోపిడీ గురైన గిరిజన సమాజాన్ని ఏకం చేసి ఈపుణ్య భూమి మీద వారి హక్కులను బలంగా చాటి చెప్పారు.బిర్సా ముండా వారి అసంపూర్తిగా వదిలివెళ్లిన ఆ ఆత్మగౌరవ యాత్రను కొనసాగిస్తూ గిరిజన సమాజాన్ని దేశ మూల స్తంభంగా నిలబెట్టే సంకల్పాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయక త్వంలోని బిజెపి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను దేశంగుర్తుంచేలా చేస్తుందిని,నవంబర్15ను జన్ జాతీయ గౌరవ దినోత్సవంగా ప్రకటించిందని,గిరిజనుల కళలు, సంస్కృతిని ప్రపంచాన్నికి తెలిసేలా ట్రైబల్ మ్యూజియాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సాబ్ కాసాత్ సాబ్ కావికాస్ మంత్రంతో ఏకల్వయ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేశారని చెప్పారు.గిరిజనుల అభివృద్ధికోసం విద్య, ఉపాధి, వైద్యం అందిస్తూ..సాధికారత కల్పిస్తుంది అత్యంత ముఖ్యంగా దేశచరిత్రలో తొలిసారిగా ఒక గిరిజన బిడ్డను ద్రౌపది ముర్మని అత్యున్నత పదవి అయినా రాష్ట్రపతిగా నియమించి గిరిజన సమాజంపై తమకు ఉన్న చారిత్రక నిబద్ధతను బిజెపి నిరూపించుకుందన్నారు.భగవన్ బిర్సాముండా స్ఫూర్తిని కోనసాగిస్తూ..ప్రధాని మోదీ నాయకత్వంలో గిరిజనుల భాగస్వామ్యం అభివృద్ధితో వికసిత్ భారత్ నిర్మించే దిశగా బిజెపి బలమైన అడుగులు వేస్తుందని గోనె శ్రీకాంత్ అన్నారు.ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోనె అంజయ్య, వైద్యుల వీరారెడ్డి,మడిపడిగే శ్రీనివాస్,పెరుమాళ్ శివ కుమార్,కావాలి నర్సింహ్మా,పిట్ల శ్రీనివాస్,సీకూరి కృష్ణ ముదిరాజ్,పోలోజు శ్రీనివాస్ చారి,కాసుల రామకృష్ణ గౌడ్ సంజీవరెడ్డి చిన్నబోయిన అనిల్ అడెపు భాను, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి





**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,నవంబర్15(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్టుగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ న్యూవిజయపురి కాలనీలో రూ.కోటి 83 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.ఇదే కాకుండా ఇటీవల కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం న్యూవిజయపురి కాలనీలో డ్రైనేజీ నిర్మాణం,కొత్త మంచినీటి పైపు లైన్లు ఏర్పాటు పనులు సైతం ప్రారంభం అయ్యాయి.ఈ పనులను పరమేశ్వర్ రెడ్డి పరిశీలించి ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు డ్రైనేజీలను,మంచి నీటి పైపు లైన్ల నిర్మాణాలను చేస్తున్నట్టుగా చెప్పారు.ఈ కార్యక్రమంలో తెల్కల మోహన్ రెడ్డి,న్యూవిజయ్ పూరికాలనీ అధ్యక్షులు లేల్లాల వెంకటేష్,పబ్బు నర్సింహా,లింగంపల్లి రామకృష్ణ,సల్ల ప్రభాకర్ రెడ్డి, పివి పాపయ్య పెద్దోళ్ల నాగిరెడ్డి,రాసా శంకరయ్య, శియావన్నరాయణ,పూస సత్తయ్య,భాస్కర్, దానయ్య కురమా నర్సింహా,సిఎహెచ్ వెంకటేశ్వర్ రావు,అలుగుల అనీల్ కుమార్,కాటేపల్లి విజయ్ కుమార్,ఈగ రాజేష్,కుశంగళ సతీష్,కాసోజు సతీష్ సిఎహెచ్ పద్మ,సుమిత్ర సావిత్రి అండాలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ 4లైన్ బి.టి.నిర్మాణానికి స్థల పరిశీలన..

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్**





**ఖమ్మంజిల్లా, నవంబర్ 15 (సూర్యరేఖ)** కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో నూతన ఇంటిగ్రెటెడ్ స్కూల్ 4లైన్ బి.టీ,నిర్మాణం కొరకు ప్రభుత్వ అధికారులు చెన్నూరు రైతులు మరియు చెన్నూరు కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థలంను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజప్రభాకర్ చౌదరి సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు యూత్ కాంగ్రెస్ కల్లూరు మండలం అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహరావు,చెన్నూరు గ్రామకాంగ్రెస్ నాయకులు పసుమర్తి మోహన్రావు,బాగాము ప్రభాకర్ చౌదరి,కల్లూరు పట్టణం,కల్లూరు మండలం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

# న్యూజెన్ హైస్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్15(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని తాళ్ళగడ్డ శివబాగ్ ప్రాంతంలో గల న్యూజెన్ హైస్కూల్ లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపల్ స్వేతా కాపూరి పాల్గొని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మెనేజ్మెంట్ అసోసియెషన్(ట్రస్మా)ఆసిఫ్ నగర్ మండల కమిటీ అద్యక్షులు,న్యూజెన్ హైస్కూల్ కరస్పాండెంట్ రవి కుమార్ కాపూరి పాల్గొని మాట్లాడుతూ...మన దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు చిన్న పిల్లలంటే అమితమైన ప్రేమ ఉండేదని,అయన జయంతి సందర్భంగా భారతదేశంలో ప్రతి ఏడాది నవంబర్ 14న బాలల దినోత్సవాన్నిజరుపుకుంటామని,ఈ బాలల దినోత్సవం అనేది పిల్లలందరికీ ఒక ప్రత్యేకమైన రోజు యని న్యూజెన్ హైస్కూల్ కరస్పాండేంట్ రవికుమార్ కాపూరి అన్నారు.విద్యార్థిని విద్యార్థులు లక్ష్యసాదన కోసం ఎన్ని అవాంతరాలు ఎదురైన తట్టుకుని నిలబడినప్పుడే విజయం సాదిస్తారన్నారు.చదువు ఒక్కటే మనిషిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలుపుతుందని,ప్రతి ఒక్కరు బాద్యతాయుతంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అదిరోశాంచాలని అబిలసించారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక జానపద, అధునిక నృత్యాలు వారి తల్లి దండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఈనెల 28వ తేదీ నుండి అమ్మవారి చీరల బహిరంగ వేలం..

**ఆలయ ఈవో పెద్దిగారి శ్రీకాంత్**

**5శుక్రవారాలు ఆలయ ప్రాంగణంలో వేలం జరుగుతుంది..**

**ఉప్పల్,నవంబర్15(సూర్యరేఖ)** ఉప్పల్ లోని వెలుగుగుట్ట శ్రీమల్లిఖార్జున స్వామి దేవాలయంలో ఈనెల28వ తేదీ నుండి డిసెంబర్ 26వ తేదీ వరకు ప్రతి శుక్రవారం అమ్మవారి చీరల బహిరంగ వేలం వేయనున్నట్లు దేవాలయం కార్యనిర్వహణ అధికారి పెద్దిగారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీదుర్గాదేవి అమ్మవారికి అలంకరించి తీసినవి మరియు కానుకలుగా వచ్చిన చీరెలను వేలం వేస్తున్నట్లు తెలిపారు.ఈ నెల28వ తేదీ శుక్రవారం,డిసెంబర్ నెల5వ తేదీ శుక్రవారం, 12వ తేదీ శుక్రవారం,19వతేదీ శుక్రవారం 26వతేదీ శుక్రవారం (5శుక్రవారం వారాలు) ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ద్వారా దేవస్థాన ప్రాంగణములో విక్రయించడానికి నిర్ణయించినట్లు ఈవో పెద్దిగారి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని దేవాలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.వేలం షరతులు,వేలం సమయమందు చదివి వినిపించనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాల కోసం శ్రీకాంత్ పెద్దిగారి ఆలయ కార్యనిర్వహణాధికారి ఫోన్ నెంబర్ 9912490641లో సంప్రదించాలన్నారు.

## అనుమతులను నిర్దేశిత గడువులోగ మంజూరు చేయాలి..

**జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్**

**జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం..**




**నారాయణపేటజిల్లాప్రతినిధి,నవంబర్15 (సూర్యరేఖ)** జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి.ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధశాఖల నుండి మంజూరు చేయవలసిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు.శనివారం కలెక్టర్ చాంబర్లో పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు.ఎస్సీ 12,ఎస్టి4,పీహెచ్సీ1లకు పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు డిఐపిసి కమిటీలో ఆమోదం తెలిపారు.ఈ కార్యక్రమంలో జిఎం లింగేశ్వర్ గౌడ్, ఐ.పి.ఓ.నర్సింగ్ రావు,ఎల్.డిఎం.విజయ్ కుమార్ సీటిఓ ప్రవీణ్ కుమార్ యం.నరేశ్,అసిస్టెంట్ హైడ్రా లాజిస్ట్ ఎస్సీకార్పోరేషన్ ఈడీఅబ్దుల్ ఖలీల్, విద్యుత్ ఎస్సీవెంకటరమణ,ఎస్ఆర్ఓ కృష్ణ గౌడ్,సాయితేజరెడ్డి ఇరిగేషన్ ఈఈ బ్రహ్మానంద,కృష్ణ గౌడ్,డిపిఓ సుధాకర్ రెడ్డి,లేబర్ శాఖ తిలక్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి మరింత కృషి.. మందముల పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,నవంబర్15(సూర్యరేఖ)** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ శనివారం కలిసి మల్లాపూర్ డివిజన్ లోని పలు సమస్యలపై చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ లోని సమస్యల కోసం మరియు డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.మల్లాపూర్ సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల కేటాయించే కేటాయింపుకు తన వంతు కృషి చేసి పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన నెమలి అనిల్ కుమార్ కు హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు.

# శభాష్ దేవాపూర్ పోలీస్ అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి ప్రాణం కాపాడిన దేవాపూర్ ఎస్ఐ గంగారం

**బెల్లంపల్లి,నవంబర్15(సూర్యరేఖ)** దేవాపూర్ ప్రాంతంలో ఉదయం చోటుచేసుకున్న ఘటనలో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించి ప్రాణాలను రక్షించడంలో దేవాపూర్ పోలీసులు చొరవ చూపారు. ఉదయం సుమారు8గంటల సమయంలో కాల్వల తిరుపతి అనే వ్యక్తి తన భార్యతో వివాదం తలెత్తడంతో నేను చచ్చిపోతా అంటూ ఇంటి నుండి వెళ్లిపోయాడు. చాలా సేపు గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా తిరుపతి కనిపించలేదు. దీంతో అతని పెద్ద కుమారుడు దేవాపూర్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పిర్యాదు చేశాడు. పిర్యాదు అందుకున్న వెంటనే ఎస్ఐ గంగారం ప్రతిస్పందించి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో తిరుపతి లొకేషన్‌ను కేవలం గంటలోనే గుర్తించారు. ఆయన దేవాపూర్ లోని సల్పల వాగు సమీప అటవీ ప్రాంతంలో



ఉన్నట్లు తెలిసిన వెంటనే ఎస్ఐ గంగారం, తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అటవీ ప్రాంతంలో ఒక చెట్టు కింద తిరుపతి అపస్మారక స్థితిలో పడిఉన్నట్లు గమనించడంతో వెంటనే అతన్ని



బయటకు తీసి ప్రాథమిక సహాయం అందించి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి వైద్యం అందుతోంది. దేవాపూర్ పోలీసుల వేగవంతమైన చర్యతో ఒక ప్రాణం నిలబెట్టబడింది.

# సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ

**నేడు నారాయణఖేడ్ కు బస్సుయాత్ర రాక..**

**నారాయణఖేడ్,నవంబర్15(సూర్యరేఖ)** సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు ఉత్సవ సంబరాలు సందర్భంగా ఈనెల16న నారాయణఖేడ్ కు బస్సుయాత్ర వస్తుందని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.ఆనంద్ తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ ఉద్దేశించి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించి సిపిఐ పార్టీ ఇంటింటా గొంతును తీసుకెళ్లడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. నారాయణఖేడ్ లో బస్సుయాత్ర నిర్వహించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరూ సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవాలని పార్టీ నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాత నిర్వహించుకోవడం జరుగుతుంది. ఇంటికి ఒక మనిషి ఊరుకో బండి అనే పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ఈ



యాత్ర కొనసాగుతుందని అన్నారు అందులో భాగంగానే మెదక్ నుండి నారాయణఖేడ్ కు విచ్చేస్తున్న బస్సు యాత్రకి పార్టీ కార్యకర్తలు నాయకులు సానుభూతిపరులు శ్రేయోభిలాషులు బస్సు యాత్రకి స్వాగతం పలికి అంబేద్కర్ చౌక్ వద్ద సమావేశం విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం అర్పించేదగిన విషయంఅన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు చిరంజీవి అశోక్, సతీష్,ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు

# విపత్తులను ఎదుర్కొనేందుకు స్వీయ రక్షణ పాటించాలి






**స్కౌట్స్ అండ్ గైడ్స్ క్రమశిక్షణ నేర్పిస్తుంది.**

**డిజాస్టర్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ క్యాంప్ ప్రారంభం..**

**మందమర్రి,నవంబర్15(సూర్యరేఖ)**స్కౌట్స్ అండ్‌గైడ్స్ లో శిక్షణ తీసుకుంటే క్రమశిక్షణతో పాటు సేవా భావం పెరుగుతుందని, విపత్తులను ఎదుర్కొనే ముందు స్వీయరక్షణ పాటించాలని ఏరియా పర్సనల్ డివై జియం సిహెచ్. అశోక్ సూచించారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్,సింగరేణి కాలరీస్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజాస్టర్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ క్యాంప్ ఫర్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ అవగాహన శిక్షణ శిబిరానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం అధ్యక్షత వహించగా పర్సనల్ డివైజియం అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... నవంబర్15 నుండి17 వరకు నిర్వ హించబోయే స్కౌట్స్ అండ్ గైడ్స్ విపత్తు నిర్వహణ శిక్షణ శిబిరాన్ని ప్రారం భించడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. చిన్న వయసు నుండి




భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో శిక్షణ పొందడం వల్ల క్రమశిక్షణ సేవాభావం ఆత్మరక్షణ అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. అనుకోని విపత్తుల సంభవించినప్పుడు ప్రమాదంలో ఉన్న వారిని రక్షించేందుకు సిద్ధపడే ముందు విద్యార్థులకు ఆత్మరక్షణ సూత్రాలు రక్షించాల్సిన విధులపై అవగాహన సూచనలు మూడు రోజులపాటు నిర్వహించబోయే శిక్షణ శిబిరంలో తెలియజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ లీడర్ వెంకటస్వామి, సింగరేణి హైస్కూల్ పిటి(గొలేటి)భాస్కర్,ఇన్చార్జి ఏ. శ్రీనివాస్,పిఆర్ఓ దయాకర్,స్కౌట్ గైడ్స్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రామంతపూర్ ఆర్టీసీకాలనీ నుండి కోటి బస్సు సర్వీస్ పునరుద్ధరణ..



**ఉప్పల్,నవంబర్15(సూర్యరేఖ)** రామంతపూర్ ఆర్టీసీ కాలనీ నుండి కోటీకి బస్సు సర్వీసును శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ప్రారంభించారుగత కొంతకాలంగా ఈ మార్గంలో బస్సు రాకపోకలు నిలిచిపోవడం వల్ల ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగానే కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావు వెంటనే ఉన్నతాధికారులతో చర్చించి శనివారం నుండి బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు రామంతపూర్ నుండి కోటీ వరకు మొత్తం 12 ట్రిప్పులు నడపనున్నట్టు కార్పొరేటర్ తెలిపారు. బస్సు సర్వీస్ పునరుద్ధరణ పై రామంతపూర్ వాసులు,కాలనీ నివాసితులు కార్పొరేటర్ శ్రీవాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుల ప్రభాకర్ రెడ్డి,జ్ఞానేశ్వర్, ఎం.సురేష్,డి.మురళి, తమ్మల రవి,చంద్రశేఖర్,దయాకర్ రెడ్డి,మోహన్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పరిశ్రమ వ్యవస్థాపక తపై అవగాహన..



**నారాయణపేటజిల్లాప్రతినిధి,నవంబర్15 (సూర్యరేఖ)**పరిశ్రమల స్థాపనతో పదిమందికి ఉపాధి లభించే విధంగా ఇంజనీరింగ్ డిప్లమా విద్యార్థులు ముందుకెళ్లాలని జిల్లా పరిశ్రమల మేనేజర్ రామ లింగేశ్వర గౌడ్ తెలిపారు. శనివారం కోస్గి పట్టణంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ డిప్లమా విద్యార్థులకు పరిశ్రమల వ్యవస్థాపకతపై అవగాహన కల్పించారు. చిన్నమధ్య తరహా పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని స్వయం ఉపాధివల్ల ఇతరులకు ఆదుకునేలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపిఓ నర్సింగరావు,ఎల్డీఎం విజయ్ కుమార్,ప్రిన్సిపాల్ శ్రీనివాసులు,వెంకటరెడ్డి,ఏడీసీ మేనేజర్ నవీన్ రెడ్డి,అసిస్టెంట్ మేనేజర్ నవీన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేటర్ బోహిని దర్షన్ చేతుల మీదుగా సీసీ రోడ్ పనులు ప్రారంభం..



**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్15(సూర్యరేఖ)** జియాగూడ డివిజన్ పరిధి లోని దుర్గానగర్ లో 22 లక్షలతో సీసీ రోడ్ పనులు ప్రారంభమైనాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ కార్పోరేటర్ బోహిని దర్షన్ పాల్గొని భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంబించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ బోహిని దర్షన్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ప్రాంత వాసుల సమస్యల పరిష్కారమే తమ కర్తవ్యమన్నారు. ప్రజా సమస్యలకై ఎల్లవేళల్లో అందుబాటులో ఉంటానని దర్షన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్ జైన్,మహేష్ యాదవ్,శివ,నారాయణ,తదితర స్థానిక నాయకులు పాల్గోన్నారు.

## కల్లూరు పట్టణలో విద్యుత్ అంతరాయం..



**ఖమ్మంజిల్లా,నవంబర్15 (సూర్యరేఖ)** కల్లూరు పట్టణ సబ్స్టేషన్ పరిధిలోని కల్లూరు పట్టణం,లోకారం ఈస్ట్,లోకారం వెస్ట్,గనియా తండా, లక్ష్మా తండా చాంద్ తండా,హనుమ తండా, ష్టయ్య బంజర్,జిడిపి పల్లి వాచ్యనాయక్ తండ,ఏ నారాయణపురం రామకృష్ణాపురం కొర్లగూడెం, గృహ వాణిజ్య పారిశ్రామిక వాడలో విద్యుత్ అంతరాయం ఉంటుందని కల్లూరు ఏఈ వెంకట్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. కనుక కల్లూరు పట్టణ సబ్స్టేషన్ పరిధిలోని పరిధిలోని పై గ్రామాల గృహ,వాణిజ్య పారిశ్రామిక వ్యవసాయ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చిన ఇన్సూరెన్స్‌ల అనుమతులను రద్దు చేయాలి




**నారాయణపేటజిల్లాప్రతినిధి, నవంబర్ 15 (సూర్యరేఖ)**తెలంగాణ ప్రగతి శీలభవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం టియుసిఐ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ఆసంఘం జిల్లా అధ్యక్షులు బి.నరసింహా అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి వచ్చినటువంటి టియుసిఐ జిల్లా అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ. కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కొడ్స్ వళ్ళ భవన నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణాల కు రూ.10 లక్షలు,సహజ మరణాలకు రూ.2 లక్షలకు పెంచి,శాశ్వత,పాక్షిక అంగవైకల్యంకు ఈనాలుగు సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వార అమలు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబర్.12ను 2025 జులై 22న విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన 2రోజులకే ప్రైవేట్ బీమా కంపెనీ లైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు,ఎర్గో జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి రూ.95 కోట్లు ట్రెయిల్ బ్లెజర్ అనే బ్రోకర్ సంస్థ ద్వారా మొత్తం రూ.340 కోట్లు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రభుత్వ అధికారులు అక్రమంగా బదిలీ చేశారు. కేంద్ర చట్టం,రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగ నిధులు దారిమళ్ళించడాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నా మని తెలిపారు. సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో ప్రభుత్వం సుమారు రూ.500 కోట్లు దుర్వ్రిని యోగం చేసింది. కార్మికులకు అవసరం లేకున్నా హెల్త్ టెస్టుచేయించు కోకపోతే లేబర్ కార్డులు తొలగిస్తామని కార్మికులను బెరిరిస్తూ టెస్టులు చేస్తున్నారు. 33 జిల్లాల్లో 17కేంద్రాలను ఎంపిక చేసుకొని 7మంది ల్యాబ్ మేనేజర్లను పెట్టి ఈటెస్టు చేస్తున్నారు. హెడ్ ఆఫీస్ హైదరాబాద్ సోమాజి గూడలో ఉన్నది. టెస్టుఒక్కో కేంద్రంలో రోజుకు 100 నుండి150 వరకు టెస్టు చేస్తున్నారు. ఒక కార్మికునికి టెస్ట్ చేస్తే రూ.3, 250లు సిఎస్సి సంస్థకు బోర్డు నుండి చెల్లిస్తున్నారు. రోజువారీగా 7సెంటర్లలో సుమారు1,000 మందికి టెస్ట్ చేయడం జరుగుతుంది. ఒక్కరోజు రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల్లో 1,000మంది కార్మికులకు టెస్ట్ చేస్తారు. టెస్ట్ చేసిన ఎంప్లాయికి సిఎస్సి సంస్థ వారు రూ.90ల చొప్పున ఇస్తున్నారు. ఏ ప్రభుత్వ హాస్పిటల్లో నైనా హెల్త్ టెస్టు చేస్తారు. ఈ టెస్టుసక్రమంగా రావడం లేదు. ఉన్న జబ్బులు లేనట్లుగా లేని జబ్బులు ఉన్నట్లుగా చూపుతున్నారు. సిఎస్సి నుండి ఒక వ్యక్తి యూరిన్,బ్లెడ్ తీసుకొని వెళ్ళి అన్ని టెస్టులు చేస్తున్నారు. అనవసరమైన టెస్టులు చేస్తు వేయిల కోట్ల రూపాయలు దారిమాలించడాన్ని కండించారు. పై సమస్యల పరిస్కారం కోసం నవంబర్ 25 తారీకున జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా, మండల కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశం పట్టణ కేంద్రంలో అడ్డాలపై ప్రచారం చేయాలనీ నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఏ.నరసింహ,తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నప్ప జిల్లా సహాయ కార్యదర్శి కనక రాయుడు జిల్లా నాయకులు డి.నరసింహ నాగేష్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులందరికీ పంటనష్ట పరిహారం చెల్లించాలి

తెలంగాణ రైతు సంఘం



**ఖమ్మం జిల్లా,నవంబర్15(సూర్యరేఖ)** కల్లూరు మండలంలో చెన్నూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, అధ్యక్షులు మాదినేని రమేష్,లు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ సంవత్సరం అధిక వర్షాలు తుఫానుల కారణంగా వరి,పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని,పంట నష్టపో యిన రైతాంగాన్ని ఆదుకొని ప్రభుత్వం నష్టపరి హారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంటలకు సమగ్ర మద్దతు ధర ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. ఒక్కో ఎకరాకు10 నుండి14 క్వింటాళ్లు దిగుబడి వచ్చే పత్తి రెండు క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చిందని అన్నారు. పండిన ఈ కొద్ది పంటను కూడా సిసిఐ నిబంధనలను మార్చి రైతుల వద్ద ఉన్న పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సంవత్సరం వరి పంటకిస్తున్న బోనస్ ఇంతవరకు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని,గత సంవత్సర బోనస్సు ఈ సంవత్సరం ఇవ్వాల్సిన బోనస్సు రైతులకు తక్షణమే చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సయుక్తా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో రైతుల ప్రదర్శన ఉంటుం దని అన్నారు. పంటలకు సమగ్ర మద్దతుధర లేకపోవడంతో రైతులు ప్రతి సంవత్సరం ఆర్థికంగా నష్టపోతున్నారని ఎరువులను రైతులకు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం కూడా మాది రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పి రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నారని ఆయన విమర్శించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారం ఉందని,అక్కడ రైతులకు ప్రభుత్వం అనేక రకాల రాయితీలు ఇస్తూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇస్తూ రైతులను ఆదుకుంటుందని, అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం రైతాంగని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తుఫాను వల్ల రైతులు పంటలు నష్టపోయిన వాటికి సర్వే చేసి నష్టపరిహారం చెల్లించవలసి ఉందని, అటువంటి పనిని ప్రభుత్వం చేపట్టలేదని వారు విమర్శించారు. పంటలకు సమగ్ర మద్దతు ధర లేకపోవడం వల్ల రైతులు ప్రతి సంవత్సరం ఆర్థికంగా తీవ్రమైన నష్టానికి గురవుతున్నారని అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం పంటలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పించాలని ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఎంతో కొంత ఇన్సూరెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకొని నష్టపోయిన పంటలకు రైతులకు నష్టపరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాదల వెంకటేశ్వరరావు సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జునరావు,రైతులు పాల్గొన్నారు.

# అన్నా ప్రజల్లోకిరా..అన్నకు చెల్లెలు సలహా





**మెదక్,నవంబర్15(సూర్యరేఖ)** కేటీఆర్ సోషల్ మీడియాలోనే పోరాటం చేస్తున్నారని..సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రజలోకి రావాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కవిత సలహాఇచ్చారు. మెదక్ జిల్లాలో కవిత పర్యటన రెండవ రోజు శనివారం సాగింది. మెదక్ లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ...కేసీఆర్ కు కళ్లకు గంతలు కట్టి బీఆర్ఎస్ ను అధోగతి పాలు చేశారన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలు రాష్ట్రంలో ప్రతి పక్షం బలంగా లేదన్న విషయాన్ని గుర్తు చేసిందన్నారు. అన్నా కేటీఆర్ సోషల్ మీడియాలోనే ప్రజల సమస్యలు తీసుకు వస్తున్నాడని,సోషల్ మీడియాను వీడి ప్రజల్లోకి వచ్చి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంగా సరైన పాత్ర పోషించడం లేదన్నారు. గ్రామాల్లో అధికార పార్టీపైవ్యతిరేకత ఉన్న జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ఓటమికి ప్రతిపక్షం బలంగా లేకపోవడమే ఓటమి పాలైందన్నారు. హరీష్ రావుకు 400 ఎకరాల భూమి హరీష్ రావు పార్టీని మోసం చేయడం మానుకోవాలన్నారు. కృష్ణార్జున అనుకునేవాళ్ళు ఒకరి దెబ్బలు ఒకరు చర్చించుకున్నారన్నారు. ఒక సభ సక్సెస్ అయితే కేసీఆర్ ని మోసినట్లు ఫీల్ అవుతున్నారని,ఆయన ముందు వీరంతాబచ్చులు అని పేర్కొన్నారు. హరీష్ రావు అవినీతిని బయటపెట్టిన సీఎం ఎందుకుచర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెడ్డిపల్లి,చిప్పలదుర్తి,తునికి గ్రామాల మధ్య హరీష్ రావుకు 400 ఎకరాల భూమి ఉందన్నారు. ఆయన భూమి కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చారని విమర్శించారు. ఆ ప్రాంతంలో రిసార్ట్ నిర్మాణం చేసి ప్రజలను రానివ్వడం లేదన్నారు. గంగుల కమలాకర్ కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్పు చిన్న చింతకుంటలో గంగుల కమలాకర్ కు15 ఎకరాలు, నవీన్ రావు కు18 ఎకరాలుభూమి ఉండడం అలైన్ మెంట్ మార్చారనిరైతులు చెబుతున్నారని,నిజామా కదా నేతలేచెప్పాలన్నారు. నేతల కోసమే ట్రిపుల్ ఆర్ నునీటిలో వాన పాముగా రింగులు మార్చారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి హాస్టల్ అద్దెరూ.లక్షా 6వేలు తీసుకుంటున్నాడని, విద్యార్థులకు కనీససౌకర్యాలు లేవన్నారు. ఐదేళ్లుగా విద్యార్థులు అవస్థలు పడుతున్న ఎందుకుపట్టించుకోవడం లేదన్నారు. ఎలాంటివి కెసిఆర్ కు తెలిసి ఉండవని తెలిస్తే ఆయన ఒప్పుకునే వారు కాదన్నారు.

## నేడు భగవాన్ బిర్సాముండా 150వ జయంతి,మహా శోభాయాత్ర..



**నాంపల్లి,హైద్రాబాద్, నవంబర్15(సూర్యరేఖ)** భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకొని గిరిజన గౌరవ దినోత్సవ మహాశోభాయాత్రను జయప్రదం చేద్దాం..భారీగా తరలిరావాలని భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అల్వాల ఇంద్రసేనారెడ్డి పార్టీ నాయ కులకు,శ్రేణులకు పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా అల్వాల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... నవంబర్16వ తేదీ ఆదివారం ఉదయం 9:30 గంటలకు ట్యాంక్ బండ్ శ్రీస్వామి వివేకానంద విగ్రహం నుండి కొమురం భీమ్ విగ్రహం వరకు శోభాయాత్ర నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సావిత్రి రాకూర్ కేంద్ర మహిళా,శిశు సంక్షేమశాఖ సహాయ మంత్రి,జి.కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి,తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు,ఈటల రాజేందర్, తెలంగాణ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.కళ్యాణ్ నాయక్,తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్,రాష్ట్ర కార్యక్రమం సంయోజకులు ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ ముఖ్యనాయకులు పాల్గొంటారని ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం..



**నారాయణపేట జిల్లాప్రతినిధి,నవంబర్15 (సూర్యరేఖ)** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పక్ పల్లి గ్రామశివారులో శనివారం ఉదయం 8: 30గంటల సమయంలో ఒక గుర్తు తెలియని శవం గుర్తించడం జరిగింది. ప్రాథమిక పరిశీలనలో,మృతుని వయస్సు 30 నుండి 40 సంవత్సరాల మధ్యలో ఉండవచ్చని,మరణించి సుమారు10 నుండి15 రోజులు అయి ఉండవచ్చని అంచనా..మృతుని శరీరంపై ఎటువంటి గుర్తింపు వస్తువులులేదా,ఆధారాలు లభించక పోవడంతో, మృతుని వివరాలు తెలియరాలేదు. దీనికి సంబంధించి సమాచారం తెలిసిన వారు వెంటనేపోలీసులను సంప్రదించాలని పేట రూరల్ ఎస్ఐ రాముడు తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఎస్ఐ నారాయణ పేట రూరల్ పిఎస్ 8712670417,సీఐ నారాయణపేట సర్కిల్,87126 70383 శవం గుర్తింపు,మరణానికి గల కారణాలపై విచారణ నారాయణపేట రూరల్ పోలీసులు కొనసాగిస్తున్నారు.

## జిల్లాలో చదువుల పండుగ కొనసాగించాలి..

జిల్లా కలెక్టర్ శిక్తాపట్నాయక్




**నారాయణపేటజిల్లా ప్రతినిధి,నవంబర్15 (సూర్యరేఖ)** నారాయణపేట జిల్లాలో చదువుల పండగ కార్యక్రమం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విద్యాశాఖ అధికారులను ఆదేశించా రు. శనివారం ఆమె అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) సంచిత్ గంగ్వార్,తో కలిసి కలెక్టర్ ఛాంబర్ లో విద్యాశాఖ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్,ఎస్సి చదువుతున్న విద్యార్థుల మార్కులు తల్లిదండ్రులకు తెలిసేలా చేయడానికి ఎస్ఎంఎస్ ద్వారాప్రతిభ తెలిసేలా సాఫ్ట్వేర్ డెవలప్ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి అపర్ సంఖ్య పెంచాలన్నా రు. ఎస్,ఎస్సి విద్యార్థులకు ప్రత్యేక పిటిఎం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్,ఎస్సితర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్ ఎక్కడ చదువుతారో అధికారులు రికార్డు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ పై ప్రజలకు అవగాహన కల్పించి దాని కొరకే ప్రజలను ఎడ్యుకేట్ చేయాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అలాగే ఎస్,ఎస్సి చదువుతున్న విద్యార్థుల పరిక్షాలకి సంబంధించిన మార్చ్ హాజరు తదితర వివరాలు పేరెంట్స్ ఎప్పటి కప్పుడు తెలుసుకునే ఉదంగత్ అప్ ను డెవలప్ చేసి పేరెంట్స్ కి అందుబాటులో తెచ్చిచూసు కునే విదంగా అవగాహన టీచర్స్ హెడ్మాస్టర్ సంబంధిత అధికారులు చర్యలుతీసుకునే విధంగా చూడాలనీ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ ప్రణయ్,ఆర్డీఓ రాంచందర్, డిప్యూటీ కలెక్టర్ ట్రైని శ్రీరామ్ ప్రణీత్,ఫణిరాజ్ డిప్యూటీ కలెక్టర్ ట్రైని,డిపిఓ సుధాకర్ రెడ్డి,రాజేష్ కుమార్, యాద్దయ్య,తదితరులు పాల్గొన్నా రు.

# టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ రద్దు




డిసెంబర్ లో రాష్ట్ర మహాసభలు..
రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు..

**హైదరాబాద్,నవంబర్15(సూర్యరేఖ)** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తృతీయ మహాసభలు డిసెంబర్ లో జరపాలని ఫెడరేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్ణయించింది.కాలపరిమితి ముగిసినందున ఫెడరేషన్ రాష్ట్ర కమిటీని పూర్తిగా రద్దు చేస్తూ తీర్మానించింది.రాష్ట్ర మహాసభల నిర్వహణకు కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ సమావేశం తీర్మానించింది. శనివారం హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు,జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్,నేషనల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య ను సంఘం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఇటీవల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వ్యవస్థాపక సభ్యుల సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అదేవిధంగా 2025-27 సంవత్సరాలకు గాను రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో జరిగిన జిల్లాల మహాసభల్లో ఎన్నికైన జిల్లా కమిటీలు యధా విధిగా కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. ఇప్ప టివరకు మహాసభలు జరగని జిల్లాల్లో ఉన్న అన్ని పాత కమిటీలను రద్దు చేస్తూ తీర్మానించింది. త్వరలో ఆయా జిల్లాల్లో అడ్ హక్ కమిటీలు వేసి జిల్లా మహాసభలు జరపాలని, నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ స్కీం అమలు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య,వైద్య సదుపాయం కల్పించాలని,సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ స్కీం అమలు చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

**బసవ పున్నయ్య తొలగింపుకు రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఆమోదం..**

ఫెడరేషన్ ను విచ్చిన్నం చేసి నవతెలంగాణలో పనిచేస్తున్న జర్నలిస్టులను,రాష్ట్ర నాయకులను, ఫెడరేషన్ సభ్యులను తప్పుదారి పట్టిస్తూ సంఘానికి సంబంధించిన లెక్కలు చెప్పకుండా సంఘం యొక్క కార్యక్రమాలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన బసవ పున్నయ్యను తొలగిస్తూ రాష్ట్ర అత్యవసర సమావేశం చేసిన తీర్మానాన్ని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సభ్యత్వ రుసుము లెక్కలు చెప్పకుండా డైరీ మ్యాగజిన్ ద్వారా ఫెడరేషన్ కు వచ్చిన ఆదాయం లెక్కలు చూపకుండా,జిల్లాల మహాసభలు జరపకుండా అడ్డుకుంటూ,సంఘాన్ని విచ్చినం చేసిన అతన్ని ఫెడరేషన్ నుండి శాశ్వతంగా బహిష్కరించడాన్ని సభ్యులందరూ విస్తృతస్థాయి ఏకగ్రీవంగా ఆమోదించారు. బహిష్కరణకు గురైన బసవ పున్నయ్యకు ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని సమావేశం స్పష్టం చేసింది. ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని సమావేశం తీర్మానించింది.ఈ విషయాన్ని జర్నలిస్టులు, ఫెడరేషన్ శ్రేయోభిలాషులు గ్రహించాలని విజ్ఞప్తి చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో ఆయన కార్యక్రమాలు చేస్తే..అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యతలను రాష్ట్ర కన్వీనింగ్ కమిటీకి అప్పగించింది.

**రాష్ట్ర మహాసభల కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు..**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర తృతీయ మహాసభల నిర్వహణ,ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఎనిమిది మందితో రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో కన్వీనర్ గా మామిడి సోమయ్య,కో-కన్వీనర్లుగా పులిపలుపుల ఆనందం,బండి విజయ్ కుమార్, ఎం.యాదగిరి, వల్లాల జగన్ ఆర్.వెంకటేశ్వర్లు, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు,కర్ర అనిల్ రెడ్డి,జి.వెంకటేశ్వర్లు ఉన్నారు.అదేవిధంగా సంఘం జాతీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టు కూసం సారంగపాణిని సమావేశం నియమించింది.

# హోమ్ గార్డుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం




అదనపు ఎస్పీ మహేందర్ సమీక్ష

**మెదక్,నవంబర్15(సూర్యరేఖ)** జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు హోంగార్డ్స్ కు ప్రమాద భీమా,ఆరోగ్య భీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ ఎస్.మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ...అకౌంట్ హోల్డర్ ప్రమాదంలో మరణిస్తే వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు రూ.40 లక్షలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ...హోమ్ గార్డులు జిల్లా పోలీస్ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తూ ప్రజల రక్షణలో ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు.ఈ సిబ్బందికి అవసరమైన సహాయం మార్గదర్శకత మరియు సంక్షేమ కార్యక్రమాలను అందించడం పోలీస్ శాఖప్రధాన బాధ్యత అని తెలిపారు.ఆర్థిక నిర్వహణ, పొదుపు అలవాట్లు,భవిష్యత్ ప్రణాళికపై సరైన అవగాహన పెంపొందితే కుటుంబాలు



మరింత స్థిరతను,భద్రతను పొందగలవని వివరించారు. అకస్మాత్తుగా మరణం సంభవించిన సందర్భంలో కుటుంబాలకు కనీస ఆర్థిక భరోసా అందించడానికి టర్మ్ ఇన్సూరెన్స్ లేదా లైఫ్ కవర్ తప్పనిసరి అని ఆయన సూచించారు.చిన్న చిన్న ఆరోగ్య సమస్యలే భవిష్యత్తులో పెద్ద ఆర్థిక భారం కావచ్చని,అందువల్ల సరైన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కుటుంబాన్ని ఆర్థిక నష్టాల నుండి రక్షిస్తుందని తెలిపారు.పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సేవింగ్స్ ప్లాన్‌లు, విద్యా పాలసీలు వంటి పథకాలలో పెట్టుబడి పెట్టడం ఎంతో మంచిదన్నారు.యాక్సిస్ బ్యాంక్ అందిస్తున్న తక్కువ ప్రీమియంతో కూడిన ప్రత్యేక ఇన్సూరెన్స్ ప్యాకేజీలు,కుటుంబ కవర్,క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాలను ప్రతి హోమ్ గార్డ్ సిబ్బంది తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ప్రభుత్వం మరియు ప్రైవేట్ బ్యాంకులు అందిస్తున్న రుణపథకాలు,పొదుపు పథకాలు,బీమా సేవలు,పెన్షన్ ప్రయోజనాలు వంటి సౌకర్యాలు కూడా సిబ్బంది కుటుంబ భద్రతకు చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు. హోమ్ గార్డుల సంక్షేమాన్ని మెరుగుపర్చేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు,ఆరోగ్య శిబిరాలు, ఆర్థికసలహా శిబిరాలను నిర్వహించే దిశగా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని అదనపు ఎస్పీ తెలిపారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే సిబ్బంది సంక్షేమం కూడా సమాన ప్రాధాన్యత కలిగిఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రంగానాయక్, ఆర్ఐశ్రీ శైలేందర్,ఆర్ఎస్ఐ నరేష్,యాక్సిస్ బ్యాంక్ అధికారులు,హోమ్ గార్డ్ రైటర్ శ్రీశ్రావణ్ జిల్లా హోమ్ గార్డులు పాల్గొన్నారు.

## కోటకొండలో మిత్ర ఇండస్ట్రీస్ ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్..

**నారాయణపేటజిల్లా ప్రతినిధి,నవంబర్15 (సూర్యరేఖ)** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో మిత్ర ఇండస్ట్రీస్ ను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ పరిశీలించారు.నారాయణపేట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్,పూర్తిస్థాయిలో వసతులు ఉన్నాయా రైతులకు సౌకర్యాలు ఉన్నాయాఅని మిత్ర ఇండస్ట్రీస్ యజమాని పీర్ మైనుద్దీన్ దగ్గర పూర్తిస్థాయిలో ప్రభుత్వ




అనుమతులు తీసుకోవాలని సూచించారు



అనంతరం మిత్ర ఇండస్ట్రీస్ కు సంబంధించిన డాక్యుమెంట్లను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. డిఎంఓ,డీఎస్ఓ జిల్లా అధికారులు ఉన్నారు.

## రోగులకు సీఎం నిధుల మంజూరు..

లబ్ధిదారుల్లో ఆనందం..



**రామాయంపేట,నవంబర్15(సూర్యరేఖ)**రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన కమ్మరి సుగుణకు రూ.17,000పిట్ల లక్ష్మికి రూ.16,000,ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు చేయడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,ప్రత్యేక చొరవతో చెక్కులను మంజూరు చేయించడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు,ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాసాయిపేట,మల్లేశం,ఉపాధ్యక్షులు బండారి మహేందర్ గౌడ్,సోషల్ మీడియా యువజన నాయకులు ముస్కుల సుధాకర్ రెడ్డి,ఉడుత రాజేశం అజిపాషా,గంగులు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణి..



**కోనాపూర్,నవంబర్15 (సూర్యరేఖ)** రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించింది.మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక కృషి మేరకు గ్రామానికి చెందిన పసుల రిషికేష్ కుటుంబానికి రూ. 11,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు.నిరుపేద,ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం చేస్తున్న సేవలను గ్రామస్థులు అభినందించారు.ఈ సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే డా.రోహిత్ రావుకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ మామిడి సిద్ధిరాములు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం సురేష్,పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ నందు మహిపాల్ రెడ్డి, యూత్ అధ్యక్షులు మామిడి సతీష్, కాంగ్రెస్ నాయకులు కరికి రమేష్ తదితరులు పాల్గొన్నారు.గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ,మరిన్ని పేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు.

## జీవన్ ప్రమాన్ పునరుద్ధరనపై అవగాహన సదస్సు..

జిఎం ఎన్.రాధాకృష్ణ



**మందమర్రి,నవంబర్15 (సూర్యరేఖ)** సి.ఎం.పి.ఎఫ్ పెన్షనర్ల కొరకు సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ అవగాహన సదస్సును సింగరేణి మాజీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏరియాలో ఈ నెల17 నుండి18 తారీకు వరకు స్థానిక సిఈఆర్ క్లబ్ లో ఉదయం10 నుండి సాయంత్రం 05గంటల వరకు జీవన్ ప్రమాన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డిఎల్సి)అవగాహన కల్పించడం కోసం సిఎంపిఎఫ్ఓ గోదావరిఖని అధికారులచే జీవన్ ప్రమాన్ పునరుద్ధరనపై క్యాంపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్ ప్రమాన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అంతర్జాలంలో ఎలా పునరుద్ధరణ (రినివల్) చేయాలో వివరించడం జరుగుతుందని తెలిపారు. మాజీ సింగరేణి ఉద్యోగులు వారి పెన్షన్ పేమెంట్ ఆర్డర్(పీపీఓ)కాపీ,ఆధార్ కార్డ్,బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్ ఆధార్ తో లింక్ ఉన్న మొబైల్ నెంబర్ తీసుకుని ఈక్యాంప్ లో పాల్గొని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిఎం కోరారు.

## అంగన్వాడి కేంద్రాల సందర్శించిన ఐసిడిఎస్, సిడిపిఓ..

వెంకటరమణ,సూపర్వైజర్ శశికళ



**కొల్చారం,నవంబర్15(సూర్యరేఖ)** కొల్చారం మండలం సంగయ్యపేట గ్రామంలో శనివారం ఐసిడిఎస్,సిడిపిఓ వెంకటరమణ, సూపర్వైజర్ శశికళ సంగాయిపేట అంగన్ వాడి కేంద్రాలను సందర్శించారు. ఫస్ట్, సెకండ్ కేంద్రాలను సందర్శంచి,అంగన్ వాడి కేంద్రలలో గల సుమన్, మాన్ పిల్లల బరువులు ఎత్తులను చూశారు. తల్లులను పిలిచి గర్భిణీ స్త్రీలకు-బాలింతలకు పిల్లలకు పౌష్టిక ఆహారం గురించి పరిశుభ్రత గురించి సలహాలు,సూచనలు ఇచ్చారు.అంగన్ వాడి కేంద్రంలో వంటకలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఎం.స్వరూప,వి. హైమవతి,అంగన్వాడి ఆయాలు,తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో భారీ వాహన తనిఖీలు

**నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఎవరూ కాపాడలేరు..**
**పోలీసుల స్పష్టమైన హెచ్చరిక..**

**రామాయంపేట,నవంబర్15(సూర్యరేఖ)**రామాయంపేట పట్టణంలో శనివారం పోలీసుల చేపట్టిన వాహన తనిఖీలు గట్టిగానే సాగాయి.ట్రాఫిక్ నియమాలను ఎవరూ లెక్కచేయరనే పరిస్థితిని పూర్తిగా మార్చాలని సంకల్పించిన పోలీసులు ఈసారి నేరుగా కఠిన ధోరణితో రంగంలోకి దిగారు. పట్టణ సీఐ వెంకటరాజగౌడ్ స్వయంగా పర్యవేక్షిస్తుండడంతో రహదారులపై వాహనదారుల్లో గణనీయమైన ఆందోళన నెలకొంది.మెదక్ రోడ్, హైదరాబాద్ హైవే, బస్టాండ్ పరిసరాలు గాంధీ చౌరస్తా ఎక్కడ చూసినా పోలీసులు ఆపిన వాహనాల వరసలు హెల్మెట్ లేకుండా వెళ్లే యువకులకు “సారీ”అనే మాటకు కూడా అవకాశం లేకుండా నేరుగా చలాన్లు జారీ చేశారు. సీట్‌బెల్ట్ ధరించని కార్ డ్రైవర్లను పోలీసులు కఠినంగా ప్రశ్నించి క్షణాల్లోనే కేసులు నమోదు చేశారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిపై పోలీసులు బిగుసుకుపోయారు. వారిని అక్కడికక్కడే అదుపులోకి తీసుకుని మెడికల్ పరీక్షలకు తరలించారు. “మద్యం తాగి వాహనం నడపడం నేరం కనీస మన్నింపు లేదు.ఎవరూ రక్షించలేరు” అని సీఐ వెంకటరాజ




గౌడ్ హెచ్చరించారు. వాహన పత్రాల విషయంలో కూడా పోలీసులు ఎలాంటి సడలింపు చూపలేదు.ఆర్ సి ఇన్స్యూరెన్స్ ప్యూషన్,డ్రైవింగ్ లైసెన్స్ఏ ఒక్క పత్రం లేని వారికి కూడా ఎటువంటి వాదనలు వినకుండా అమలు చర్యలు చేపట్టారు.పలువురు నిర్లక్ష్యంగా వాదించిన వాహనదారులను అదుపులోకి తీసుకునే స్థితికి కూడా అధికారులు వెళ్లినట్లు సమాచారం. “పట్టణంలో ట్రాఫిక్ క్రమశిక్షణను భంగం చేసే ఏ చిన్న తప్పిదాన్నీ వదిలే ప్రసక్తే లేదు. ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.ఇకపై కఠిన చర్యలు మాత్రమే నగరంలో అమల్లో ఉంటాయి”అని సీఐ స్పష్టం చేశారు.ఈ తనిఖీలతో పట్టణమంతా ఒక్కసారిగా అప్రమత్తమైంది.పత్రాలు లేని వారిలో హడావిడి మొదలయ్యింది.పలువురు దగ్గరే హెల్మెట్లు కొనుగోలు చేసి పెట్టుకోవడం గమనార్హం.

**పోలీసులు తెలిపినట్లుగా..**

“రామాయంపేటలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం ఇకనుంచి అసాధ్యం.ఎవరైనా ఉల్లంఘిస్తే,తక్షణమే కఠిన చర్యలు.”

# ఘనంగా సప్తశక్తి సంఘం కార్యక్రమం





**రాజేంద్రనగర్,నవంబర్15(సూర్యరేఖ)**శ్రీసరస్వతి శిశుమందిర్ శివరాంపల్లి పాఠశాలలో సప్తశక్తి సంఘం కార్యక్రమం మహిళలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్, పొదుపు సంఘ మహిళా అధ్యక్షురాలు మంజుల సరస్వతి విద్యాపీఠం రిటైర్డ్ ఆచార్యులు ఆదిమూలం పద్మారాణిలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వక్తలుగా ఆర్.అనురాధ,గవర్నమెంట్ రిటైర్డ్ హెడ్ మాస్టర్ కే.విజయలక్ష్మి,ఆర్ఎస్ఎస్ సేవికా సమితి సభ్యులు కుటుంబ ప్రబోధన్ గురించి,పర్యావరణ పరిరక్షణ అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... కుటుంబం సమాజానికి మూల స్తంభమని,మంచి కుటుంబం విలువలతో పెరిగిన వ్యక్తులే సమాజాభివృద్ధికి పునాది వేస్తారని పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా స్వీకరించు చిన్నచిన్న చర్యల ద్వారా పెద్ద మార్పు సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా సమాజాభివృద్ధిలో మహిళల పాత్రపై ప్రసంగించారు.కుటుంబంలో స్త్రీ పాత్ర క్షమా మాతృ,ధైర్య,వివేకం ఉండాలని ప్రస్తావించారు.ఒక కుటుంబంలోని ఆడ,మగ పిల్లల మధ్య వ్యత్యాసం లేకుండా చూడాలని,బాగా చదివించి ప్రయోజకులను చేయాలని పిల్లల ప్రవర్తన తోటి వారికి సహాయం తదితర అంశాలపై విపులంగా వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు కె.శ్రీనివాస్, కమిటీ సభ్యులు పెండ్యాల చంద్రమోహన్,సదాల చంద్రారెడ్డి,గౌట్టి అనిల్,కందాడ జంగారెడ్డి,గుమ్మడి మోహన్ రెడ్డి,ఆచార్యుల బృందం పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి





**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**నార్సింగి,నవంబర్15(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. నార్సింగి గురుకులంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.నార్సింగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన రెండు కీలక అభివృద్ధి కార్యక్రమాలు రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.మున్సిపల్ నిధుల నుంచి రూ.10లక్షల వ్యయంతో పాఠశాల విద్యార్థినుల కోసం అత్యాధునిక పింక్ టాయిలెట్స్ నిర్మాణం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్ కింద రూ.10 లక్షల వ్యయంతో వసిరం వినీల వెంచర్స్ వారి సౌజన్యంతో నిర్మించిన వాటర్ ట్యాంక్ లను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో తమ ప్రభుత్వం నిబద్ధతను తెలియజేశారు.ఈ అభివృద్ధి పనులు పాఠశాలలో విద్యార్థుల సౌకర్యాన్ని మరింత పెంచుతాయని



పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది,మున్సిపల్ కమిషనర్,స్థానిక నాయకులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## విజయ డైరీ అధ్యక్షులు ఆకుల రవికుమార్ ఆధ్వర్యంలో గాలికుంటక్యాంపు..



**కామారెడ్డి,నవంబర్15(సూర్యరేఖ)** ప్రతి సంవత్సరం లాగానే విజయ డైరీ అధ్యక్షులు ఆకుల రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం సారంపల్లి గ్రామంలో గేదెలకు గాలికుంటు టీకాను వేయడానికి క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది దీనిలో డాక్టర్లు రవికిరణ్,శ్రీనివాస్,ప్రవీణ్ బాలు, నలుగురు డాక్టర్లు క్యాంపులో పాల్గొన్నారు.అలాగే కార్యదర్శి కంచర్ల రాజగోపాల్ కమిటీ సభ్యులు కొత్తూరు బాల్రాజ్,మామిళ్ల నర్సింలు, సంగిశెట్టి నాగరాజు,పెరిక శ్రీనివాస్,కొత్తూరి రాజుకుమార్, పోలుబాల్ నరసింహులు,రైతులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి..



**ముస్తాబాద్,నవంబర్16 (సూర్యరేఖ)** విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అవునూర్ గ్రామములో చోటు చేసుకుంది. ముస్తాబాద్ ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం ఆవునూర్ గ్రామానికి చెందిన బద్ది జయసింహారెడ్డి (65) ఉదయం 11 గంటలకు పొలము పనులు చేస్తుండగా బోర్ మోటార్ వైర్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని మృతుని కుమారుడు బానుచందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రమాదంలో గాయపడిన డాక్టర్ ప్రేమ్‌రాజ్ కుటుంబ సభ్యులకు పరామర్శ.



**రాజేంద్రనగర్,నవంబర్15(సూర్యరేఖ)** బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజు ప్రమాదంలో గాయపడటం బాధకరమని,ఆయన త్వరగా కోలుకోవాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు,జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్,లు అన్నారు.ఈ నెల13 వ తేదీన డాక్టర్ ప్రేమ్ రాజ్ ఆయన సతీమణితో కలిసి మాడుగుల వెళ్తుండగా దారి మధ్యలో కారుకు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయాలపాలు కావడంతో శంషాబాద్ లోని ట్రేడెంట్ ఆసుపత్రిలో డాక్టర్ సత్యం ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రికి డాక్టర్ ప్రేమ్ రాజ్ ను తరలించారు.ఈ మేరకు వారు నాయకులు మల్లేష్ యాదవ్,ఈ. వేణుగోపాల్,లు ప్రేమ్ రాజ్ కూతురు సుష్మను మర్యాదపూర్వకంగా కలిసి ధైర్యం చెప్పారు.డాక్టర్లతో మాట్లాడి అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం వారి మెడకు తీవ్రంగా గాయమై చికిత్స పొందుతున్నారని తెలుసుకున్నారు.వారి సతీమణి ట్రైడెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నారని వివరించారు.

## నేడు కాటేదాన్,గగన్ పహాడ్,లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం..



**రాజేంద్రనగర్,నవంబర్15 (సూర్యరేఖ)** గగన్ పహాడ్, కాటేదాన్ విద్యుత్ సెక్షన్లలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్లు రవీందర్ ప్రవీణ్,లు తెలిపారు. కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గంగోత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం1:00 వరకు షమాటెంట్ హౌస్,బాబా టెంట్ హౌస్,గణేష్ నగర్,టీఎన్జీవోస్ కాలనీ,అమ్మ గార్డెన్ పైనీర్ స్కూల్,గంగోత్రి లేన్ పారిశ్రామిక వాడ ప్రాంతం,గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఆర్ఇసి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు తమిళనాడు హెూటల్, డైమండ్ కంట,క్లాక్స్ హెూటల్ లెన్,జి కాటేదాన్ అండర్ బ్రిడ్జి ప్రాంతం,గోల్డ్ డ్రాప్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకటేశ్వరనగర్, చర్చిగల్లి,జి కాటేడాన్ బ్రిడ్జి,పాహెల్ ఫుడ్ విద్యుత్ స్పీకర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ పారిశ్రామిక ప్రాంతం జల్ పల్లి పారిశ్రామిక వాడ ప్రాంతంలలో విద్యుత్ సరఫరా నిలుపు వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## అయ్యప్ప స్వామి మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్





**రాజేంద్రనగర్,నవంబర్15 (సూర్యరేఖ)**అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో లక్ష్మమ్మగుడి దగ్గర అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి (18వ)మహా పడి పూజలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

## ప్రజల మనిషి పేదల డాక్టర్

**సోషలిస్ట్ అభ్యుదయ భావాలు కలిగిన అపర మేధావి డాక్టర్ బాలకిష్టయ్య.**




**వనపర్తి :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిడాక్టర్ బాలకిష్టయ్య శతజయంతి సందర్భంగా శనివారం ఉదయం తెలంగాణ మాజీ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్ బాలకిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్.బాలకిష్టయ్య తన జీవితకాలం పేదల పక్షాన నిలబడి సేవలు అందించిన మహోన్నత శక్తి అని సోషలిస్ట్ అభ్యుదయ భావాలు కలిగి కాంగ్రెస్ వ్యతిరేఖ రాజకీ యాలు చేశారని అన్నారు. ప్రజలందరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి ఉన్నతికి, అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర సమరయోధుడుగా, సంఘసం స్కర్తగా సామాజిక న్యాయం,విద్యాపర్తిగా వనపర్తిని అభివృద్ధి చేశారని కొనియాడారు. ప్రజా డాక్టరుగా కొనసాగుతూ పట్టణ అభివృద్ధి సంస్థ స్థాపించి ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చి సర్పంచిగా, మున్సిపల్ చైర్మన్ గా పట్టణాన్నికి మంచినీటి సౌకర్యం,మౌలిక వసతులు,ఎందరికో ఉద్యోగాలు కల్పించి వనపర్తి పితామహునిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే గా మండలానికి జూనియర్ కళాశాల మరియు మహిళా జూనియర్ కళాశాల,డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారని మాజీ మంత్రి అన్నారు. కుటుంబ సభ్యులు డాక్టర్.భూపేష్,మాజీ ఐ.ఏ. యస్ దినకర్,మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రమిలమ్మ,మాజీ సర్పంచ్ జయంతి,సంజీవ్ ముదిరాజ్, సంజయ్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ గట్టు యాదవ్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్ , బాల్ రామ్ సార్,వేణు రెడ్డి, స్వరాజ్యం సార్,వీరయ్య సార్,కృష్ణయ్య సార్,అమర్నాథ్,శంకర్ గౌడ్,బైరోజు.చంద్రశేఖర్,మాజీ జెడ్.పి.టి. సి రఘుపతి రెడ్డి, మాజీ వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్స్ కాగితాల.లక్ష్మీనారాయణ,బండారు.కృష్ణ,నాగన్న యాదవ్,ఉంగ్లం. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి, ఇమ్రాన్,కె.మాణిక్యం,జాతృ నాయక్, జోహెబ్ హుస్సేన్,చిట్యాల.రాము,మంద రాము తదితరులు పాల్గొన్నారు.

## పాన్గల్ అంగన్వాడి సెంటర్‌లో ఘనంగా బాలల దినోత్సవం

**వనపర్తి :** పానగల్ మండల కేంద్రంలో అంగన్వాడి సెంటర్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరాజులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14 భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు, ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం కాబట్టి ఎక్కువ సేపు పిల్లలతోనే గడిపేవాడు.జవహర్‌లాల్ నెహ్రూను పిల్లలు ఆప్యాయంగా చాచా నెహ్రూ ("అంకుల్ నెహ్రూ") అని పిలిచేవారు , మరియు ఆయనపై వారి విశ్వాసం ఆయనకు నిరంతరం ఆనందాన్ని కలిగించేది అని పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా, నెహ్రూ "దేశంలో పిల్లలు మరియు వారి సంక్షేమంపై నిరంతరం దృష్టి కేంద్రీకరించబడే వాతావరణాన్ని సృష్టించాలని" కోరుకున్నారు.. ఐసిడిఎస్ సూపర్వైజర్ షాహిన్ బేగం మాట్లాడుతూ 1958లో ఒక ఇంటర్వ్యూలో రామ్ నారాయణ్ చౌదరి అడిగినప్పుడు , దేశ భవిష్యత్తు పిల్లలపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ఆయన పిల్లలపై ప్రేమ కలిగి ఉన్నారా అని అడిగినప్పుడు, నెహ్రూ ఇలా సమాధానమిచ్చారు, "నేటి పిల్లలు రేపటి భారతదేశాన్ని తయారు చేస్తారని నేను ఎప్పుడూ భావించాను మరియు మనం వారిని పెంచే విధానం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోఆర్డీఎస్ ఏ టు జె సోషల్ మొబిలైజర్ ఏ రాజశేఖర్ మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 100 డేస్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించే పోస్టర్లు రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాన్గల్ పంచాయతీ కార్యదర్శి నరేష్ గౌడ్, అంగన్వాడి టీచర్స్ మాధవి, జిలే కాబి,తిరుపతమ్మ, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## అశోక హోటల్‌లో కేక్ మిక్సింగ్ ఫెస్ట్

**హైదరాబాద్ :** క్రిస్మస్ వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. హైదరాబాద్ లకిడికపుల్ లోని అశోక హోటల్ లో కేక్ మిక్సింగ్ ఫెస్ట్ తో క్రిస్మస్ సంబరాలు ప్రారంభించారు. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, దేశీయ మద్యంతో పాటు ఖరీదైన వైన్ పోసి హోటల్ సిబ్బంది తో కలిసి ఎండి డాక్టర్ తేజస్విని రెడ్డి కేక్ మిక్సింగ్ చేశారు. ఈ సందర్భంగా హోటల్ సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పోటీపడి కేక్ మిక్స్ చేశారు. ఈ కేక్ మిక్సింగ్ను డిసెంబర్ రెండో వారం వరకు నానబెట్టి సోక్ చేసి చివరగా కేక్ తయారీని ప్రారంభిస్తామని హోటల్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జావేద్ తెలిపారు. ప్రత్యేకమైన మసాలాలు లవంగాలు ఇలాచీ పౌడర్ను అందులో వేసి ఆల్కహాల్ తో కలిపి మిశ్రమాన్ని తయారు చేస్తామని తెలిపారు.

# ఎబివిపి ఆధ్వర్యంలో వశిష్ఠ డిగ్రీ కళాశాలలో భగవాన్ బీర్సాముండా 150వ జయంతి వేడుకలు




**కామారెడ్డి,నవంబర్15(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో భగవాన్ బీర్సాముండా 150జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాని ఉద్దేశించి ఈ కార్యక్రమానికి వక్తగా వచ్చిన ఏబీవీపీ నగర అధ్యక్షులు డాక్టర్ ఏనుగు అనిల్ రెడ్డి మాట్లాడుతూ...భారత స్వతంత్ర సమరచరిత్రలో గాంధీజీ,సుభాష్ చంద్రబోస్,అల్లూరి సీతారామరాజు వంటి మాహానియుల కోవకు చెందిన ఆదివాసి వీరుడు భగవాన్ బీర్సాముండా 1875 నవంబర్ 15న జార?ండ్లోని వులిహాటు గ్రామంలో జన్మించిన ఆయన కేవలం 25ఏళ్ల వయసులోనే బ్రిటిష్ వారి వ్యతిరేక పోరాటంలో తుది శ్వాస విడిచారు.బ్రిటిష్ పాలకులు సైనిక దౌర్జన్యంతో తప్పుడు ప్రచారంతో గిరిజన సమాజాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించిన తరుణంలో యువకుడిగా బీర్సా ముండా ఈదోపిడిని త్వరగా గ్రహించి మన దేవుడు ప్రకృతిలో ఉన్నాడు.మన భూమి మన తల్లి దాన్ని ఎవరు దోచుకోలేరు.అని ప్రచారం ప్రారంభించి గిరిజన హృదయాల్లో విప్లవాన్ని రగిలించి ఆదివాసి హక్కుల కోసం విప్లవం చేయడం జరిగింది. బిర్సాముండా కేవలం తిరుగుబాటుదారుడు కాదు ఒక సాంస్కృతిక పునరుద్దీవకారుడు.1899 డిసెంబర్లో ఉల్గులను విప్లవం ప్రారంభించి నాడు.దీనిలో వందలాది మంది గిరిజనులు వీరవరం పొందారు.చివరికి బీర్సా పట్టుబడ్డలతో రాంచీ జైల్లో పెట్టారు. 1900జూన్9వ తేదీన తన 25ఏట జైల్లో అమరుడయ్యాడు.బీర్సా ముండా జయంతి ప్రాముఖ్యతను గుర్తించిన భారత ప్రభుత్వం 2021లో ఆయన జయంతిని"జన జాతి గౌరవ దినోత్సవం"గా ప్రకటించింది. ఆదివాసి ఆత్మగౌరవ పతాక బీర్సాముండా స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చు కోవాలన్నారు!! ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి రాపాక సాయి,జిల్లా ఎస్ఎఫ్‌డి కన్వీనర్ సూర్య, మహిళా నాయకురాలు దుర్గ,ఆజార్, కోషిక్, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు





**రాజేంద్రనగర్,నవంబర్15(సూర్యరేఖ)** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాస్,ఆర్సీ రంగారెడ్డి రాజేష్ కుమార్,లు అన్నారు.ఈ నెల11 నుంచి13 వరకు పాలమాకుల గురుకులంలో జరిగిన అండర్-14,అండర్-19 జిల్లా క్రీడామీట్ ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్పోర్ట్స్ ఓఎస్డీ పి.శ్రీనివాస్,రంగారెడ్డి జిల్లా ఆర్‌సీఓ రాజేష్ కుమార్ లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...క్రీడలతో పాటు విద్యార్థులు చదువులోనూ సత్తాచాటాలన్నారు.అండర్-14 విభాగంలో వాలీబాల్లో మొదటి స్థానం మొగిలిగిద్ద, ద్వితీయ స్థానం పాలమా కుల కైవసం చేసుకున్నాయి. కబడ్డీలో మొదటి స్థానం ఉప్పల్,ద్వితీయ స్థానం ఘట్‌కేసర్ కైవసం చేసుకున్నాయి.ఖో-ఖోలో మొదటి స్థానం ఘట్‌కేసర్,ద్వితీయ స్థానం షాబాద్ కైవసం చేసుకున్నాయి. చెస్ మొదటి స్థానం కుత్బుల్లాపూర్,ద్వితీయ స్థానం మల్కాజిగిరి కైవసం చేసుకున్నాయి. అండర్-19 విభాగంలో వాలీబాల్లో మొదటి స్థానం షాబాద్,ద్వితీయ స్థానం యాచారం కైవసం చేసుకున్నాయి.కబడ్డీలో మొదటి స్థానం షాబాద్,ద్వితీయ స్థానం పాలమాకుల కైవసం చేసుకున్నాయి. టెన్నికాయిట్ లో మొదటి స్థానం పాలమాకుల ద్వితీయ స్థానం యాచారం కైవసం చేసుకున్నాయి చదరంగం మొదటి స్థానం యాచారం,ద్వితీయ స్థానం షాబాద్ కైవసం చేసుకున్నాయి.మొత్తం ఛాంపియన్‌షిప్ లో అండర్-14లో పాలమాకుల విద్యార్థినిలు (జట్టు) గెలుచుకున్నారు.వ్యక్తిగత విభాగంలో సుస్మిత మొగిలిగిద్ద విద్యార్థిని గెలుపొందింది.అండర్-19లో షాబాద్ (జట్టు) గెలుపొందింది.అండర్-19 వ్యక్తిగత విభాగంలో (ఛాంపియన్షిప్ ని) ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని బి.పూజిత కైవసం చేసుకుంది.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాస్,ఆర్సీ రంగారెడ్డి రాజేష్ కుమార్,శివాజీ రాజ్,పాఠశాల కళాశాల ప్రిన్సిపల్,జిల్లా కన్వీనర్ అనిత విజేతలకు బహుమతులు అందించారు.

# వైభవంగా హనుమాన్ శోభయాత్ర

**శ్రీరామ నామస్మరణతో మార్మోగినా కన్నెపల్లి**






**బెల్లంపల్లి,నవంబర్15(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లాలోని కన్నెపల్లి మండలం కేంద్రంలో హనుమాన్ శోభయాత్ర,భజన కార్యక్రమాలు శనివారం వైభవంగా నిర్వహించారు.జిల్లా భజన మండలి సంఘం అధ్యక్షుడు దురిశెట్టి వెంకటాచారి ఆధ్వర్యంలో కన్నెపల్లి మండలంలోని బ్రిడ్జి నుంచి మొదలుకొని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వరకు హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా భజన సంఘం అధ్యక్షుడు దురిశెట్టి వెంకటాచారి,పలు మండలాల నుంచి వచ్చిన భజన సంఘం కళాకారులు మాట్లాడుతూ...అంతరించి పోతున్న భజన కళను కాపాడుకునేందుకు భక్తితో భక్తులు భజన కార్యక్రమాలు చేస్తూ కృషి చేయాలన్నారు. ఆలయాల్లో భజన కార్యక్రమాల కోసం కళాకారుల అందరినీ గుర్తించి ఆలయాల్లో ఉపాధి కల్పించాలని కోరారు. పాఠశాలల్లో సైతం కళాకారులను ఏర్పాటు చేసి విద్యార్థులకు సంగీత, కూచిపూడి, భరతనాట్యం లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పించాలన్నారు. ఇప్పుడు యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో పయనించాలన్నారు.అనంతరం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయంలో భజన కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో గంగా చంటయ్య,బండ శంకర్,పూసల గిరిబాబు శంకర్ గౌడ్,పోలోజు సురేష్,పుసల సత్యనారాయణ బాపుచారి భజన మండలి సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డాక్టర్ జయచంద్రమోహన్



**దామరగిద్ద,నవంబర్15(సూర్యరేఖ)** దామరగిద్ద మండల కేంద్రంలో ప్రధాన ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో అన్ని రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ...అందరు సమయ పాలన పాటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో దీక్షపతి డాక్టర్ భారత శివారెడ్డి డాక్టర్ ఐశ్వర్య, వెంకటేష్ సూపర్ వైజర్ నర్మదా స్టాఫ్ నర్సులు తది తరులు పాల్గొన్నారు.




# దర్శకత్వంపై దృష్టి సారించిన రానా..




రామానాయుడు పెద్ద మనవడు రానా మొత్తానికీ తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. రామానాయుడు తన పెద్ద కొడుకు సురేశ్ బాబు ఇద్దరు పిల్లల్లో పెద్దవాడైన రానా ను దర్శకుడిని, చిన్న వాడైన అభిరామ్ ను హీరోను చేయాలని అనుకున్నారు. ఎందుకంటే తన కొడుకులిద్దరిలో సురేశ్ నిర్మాత కాగా వెంకటేశ్ హీరో. ఇద్దరూ ఎప్పుడూ మెగా ఫోన్ పట్టాలని అనుకోలేదు. అయితే రామానాయుడుకు మాత్రం చివరి వరకూ ఒక్క సినిమా అయినా డైరెక్ట్ చేయాలనే కోరిక ఉండేది. కానీ దానిని తీర్చుకోకుండానే ఆయన కన్నుమూశారు. రానా ను డైరెక్టర్ గా చూడాలని రామానాయుడు అనుకోవడానికి కారణం లేకపోలేదు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు.తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి మాట్లాడుతూ..... వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు.

# అనుకున్నట్లే 'వారణాసి' టైటిల్ ఫిక్స్

ప్రస్తుతం ఎక్కడ చూసినా మహేశ్-రాజమౌళి 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్ హడావుడి గురించే డిస్కషన్. హైదరాబాద్ శివారులో ఈ కార్యక్రమం భారీగానే ప్లాన్ చేశారు. అభిమానులతో పాటు వేలాదిమంది దీన్ని వీక్షిస్తున్నారు. అయితే ఈవెంట్ ప్రారంభంలోనే మూవీ టైటిల్ ఏంటనేది ప్రకటించేశారు. గత కొన్నిరోజుల నుంచి అనుకుంటున్నట్లే 'వారణాసి' అని ఫిక్స్ చేశారు. టైటిల్ గ్లింప్స్ వీడియోని ఈవెంట్ స్క్రీన్ పై ప్రసారం చేశారు. టైటిల్ గ్లింప్స్ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిపోతోంది. గత కొన్నిరోజుల నుంచి రుద్ర, వారణాసి.. ఇలా పలు టైటిల్స్ వినిపించాయి. వీటిలో ఏది పెడతారా అనే డిస్కషన్ అయితే నడిచింది. ఫైనల్‌గా రాజమౌళి 'వారణాసి' అనే పేరుకే కట్టుబడి ఉన్నట్లు ఇప్పుడీ వీడియోతో క్లారిటీ వచ్చేసింది. ఇందులో మహేశ్ బాబు రుద్ర అనే పాత్రలో కనిపించబోతున్నాడు. ప్రియాంక చోప్రా, మందాకిని పాత్రలో.. పృథ్వీరాజ్ సుకుమారన్, కుంభ అనే విలన్‌గా కనిపిస్తాడు. వీళ్లు ముగ్గురు కాకుండా ఇంకెవరెవరు ఉన్నారనేది వీడియోలో రివీల్ చేస్తారేమో చూడాలి?


# వంద కోట్ల డెబ్యూ.. ఎక్కడికి వెళ్లిపోయాడు?




తొలి సినిమాతోనే వంద కోట్ల వసూళ్లు రాబట్టడం అన్నది ఎంత పెద్ద బ్యాగ్రౌండ్ ఉన్న హీరోకైనా చాలా పెద్ద టార్గెట్టే. 'ఉప్పెన' సినిమాతో ఈ సెన్సేషనల్ ఫీట్ సాధించాడు వైష్ణవ్ తేజ్. ఆ సినిమా సక్సెస్ క్రెడిట్లో హీరోకు మేజర్ షేర్ ఇవ్వలేం కానీ.. డెబ్యూలోనే తన పేరు మీద వంద కోట్ల సినిమా ఉండడం మాత్రం తనకు పెద్ద ప్లస్ అనడంలో సందేహం లేదు. కానీ 'ఉప్పెన'తో వచ్చిన హైప్‌ను అతను సరిగా ఉపయోగించుకోలేకపోయాడు. వైష్ణవ్ రెండో చిత్రం 'కొండపొలం' దారుణమైన ఫలితాన్నందుకుంది. మూడో చిత్రం 'రంగ రంగ వైభవంగా', నాలుగో మూవీ 'ఆదికేశవ' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. తొలి సినిమాతో వచ్చిన పేరు, మార్కెట్ మొత్తాన్ని తర్వాతి మూడు సినిమాలు తుడిచిపెట్టేసి వైష్ణవ్‌ను నేల మీదికి తెచ్చేశాయి. దీంతో తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే విషయంలో అయోమయంలో పడిపోయాడీ మెగా కుర్రాడు. 'ఆది కేశవ' రిలీజై రెండేళ్లు కావస్తోంది. ఇప్పటిదాకా తన తర్వాతి సినిమాను వైష్ణవ్ ప్రకటించలేదు. అసలు ఈ రెండేళ్లలో తన కొత్త సినిమా గురించి ఏ కబురూ వినిపించకపోవడం ఆశ్చర్యకరం. మరీ ఇంత గ్యాప్ తీసుకుంటే ప్రేక్షకులు హీరోను మరిచిపోయే అవకాశముంది. కొత్త సినిమాకు బజ్ క్రియేట్ చేయడం కూడా కష్టమే. ఈ రెండేళ్లలో ఒక్క కథను కూడా ఓకే చేసి ముందుకు తీసుకెళ్లకపోయాడంటే వైష్ణవ్ అంత జాగ్రత్త పడుతున్నాడా.. లేక తన దగ్గరికి కథలు రావడం లేదా అన్నది ప్రశ్నార్థకం. ఐతే లేటెస్ట్‌గా వినిపిస్తున్న కబురేంటంటే.. అతను విక్రమ్ కుమార్ నుంచి నరేషన్ విన్నాడట. ఈ ప్రాజెక్టును సీరియస్‌గా పరిగణిస్తున్నాడట. విక్రమ్‌కు కూడా కెరీర్లో బాగా గ్యాప్ వచ్చింది. హలో, గ్యాంగ్ లీడర్, థాంక్యూ ఫ్లాపులతో అతను వెనుకబడిపోయాడు.

# 36 ఏళ్ల తర్వాత రిలీజ్ చేస్తే.. ఇప్పుడూ అదే హంగామా

నాగార్జున కెరీర్‌లో మైల్‌స్టోన్ లాంటి సినిమా 'శివ'. 1989లో థియేటర్లలో రిలీజైన ఈ మూవీ.. రాంగోపాల్ వర్మ అనే దర్శకుడిని ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఓ రకంగా చెప్పాలంటే టాలీవుడ్ రూపురేఖల్ని ఈ చిత్రం మార్చేసిందని చెప్పొచ్చు. సౌండింగ్, సినిమాటోగ్రఫీని సరికొత్త పుంతలు తొక్కించిన ఈ చిత్రం.. తాజాగా రీ రిలీజ్ అయింది. ఇప్పుడు కూడా అద్భుతమైన వసూళ్లు అందుకుంది. అప్పట్లో రూ.కోటి రూపాయల బడ్జెట్ పెడితే రూ.4 కోట్ల వరకు వసూళ్లు వచ్చాయట. దీంతో ఈసారి రీ రిలీజ్ చేద్దామని ఫిక్సవడంతో దాదాపు రూ.2 కోట్లు పెట్టి ఇప్పటి టెక్నాలజీకి తగ్గట్లు డాల్బీ సౌండ్, 4కె విజువల్స్ తీసుకొచ్చారట. గత కొన్ని నెలలుగా ఈ పనంతా రాంగోపాల్ వర్మ దగ్గరుండి చూసుకున్నారట. గత కొన్నిరోజులుగా కొత్త సినిమాలానే దీనికి కూడా ప్రచారం చేశారు. నాగ్, వర్మ కలిసి మీడియాతోనూ మాట్లాడారు. అలా థియేటర్లలోకి వచ్చింది. తొలిరోజు (నవంబరు 14) తెలుగు రాష్ట్రాల్లో మంచి రెస్పాన్స్ అందుకుంది. ఈ క్రమంలోనే రూ.2.5 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ వారం 'కాంత' తప్పితే పెద్దగా చెప్పుకోదగ్గ మూవీస్ ఏం రాలేదు. బహుశా ఇదే 'శివ' రీ రిలీజ్ కలెక్షన్లకు కలిసొచ్చినట్లు ఉంది. మరి ఈ వీకెండ్ అయ్యేసరికి 'శివ' ఇంకెన్ని కోట్లు కలెక్షన్ సాధిస్తుందో చూడాలి?




# స్టూడెంట్స్ మోటివేషనల్ స్పీచ్ ఇచ్చిన శర్వానంద్



యంగ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం ఒక మంచి విజయం కోసమా ఎదురుచూస్తున్నాడు. శర్వా ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. డిసెంబర్ లో బైకర్ తో మెప్పించడానికి సిద్ధమైన శర్వా..సంక్రాంతికి నారీ నారీ నడుమ మురారీ సినిమాతో రానున్నాడు. ఇక బైకర్ సినిమా రిలీజ్ కు దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన శర్వా.. కాలేజ్ లను విజిట్ చేస్తూ స్టూడెంట్స్ తో మమేకమై సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాడు. తాజాగా గచ్చిబౌలిలోని రిజోనెన్స్ కాలేజ్ ఫెస్ట్ కి ముఖ్య అతిధిగా విచ్చేశాడు. శర్వా రాకతో స్టూడెంట్స్ మరింత సందడి చేశారు. ఇక ఈ ఫెస్ట్ లో బైకర్ గురించిన విశేషాలను శర్వా స్టూడెంట్స్ తో పంచుకున్నాడు. అంతేకాకుండా స్టూడెంట్స్ మోటివేషనల్ స్పీచ్ కూడా ఇచ్చాడు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా లేచి నిలబడాలని, తమ జీవితంలో నువ్వు ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఎవరు చెప్పాల్సిన అవసరం లేదని.. నిన్ను నువ్వు నమ్మితే సక్సెస్ అదే వస్తుందని తెలిపాడు.' నేను కొన్ని విషయాలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

# కపూర్ ఫ్యామిలీపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ.. ట్రైలర్ చూశారా.!

బాలీవుడ్ స్టార్ కుటుంబం కపూర్ ఫ్యామిలీకి సంబంధించి నెట్‌ఫ్లిక్స్ వేదికగా డాక్యుమెంటరీ సిరీస్ రాబోతుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు రాజ్ కపూర్ 100వ బర్త్‌డే సందర్భంగా 'డైనింగ్ విత్ ది కపూర్స్' అనే పేరుతో రూపొందిన ఈ ఫ్యామిలీ డాక్యుమెంటరీ నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ డాక్యుమెంటరీలో కపూర్ కుటుంబానికి చెందిన అగ్ర నటులు రణ్‌బీర్ కపూర్, కరిష్మా కపూర్, కరీనా కపూర్ ఖాన్ తదితర ప్రముఖులు తమ కుటుంబ అనుబంధాలు, జ్ఞాపకాలు, బాల్యం గురించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకోనున్నారు. బాలీవుడ్ లెజెండ్, పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్‌ల వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఈ కుటుంబంలోని ప్రస్తుత తరం స్టార్స్ జీవిత విశేషాలు అభిమానులకు ఆసక్తికరంగా మారనున్నాయి.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,